PRGI REGD No.: TGTEL/26/A4986

ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి

పక్కా తెలుగు | 5 DOTS NETWORK

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 025 | ఆదివారం | 19-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Medchal Malkajgiri | Volume : 01 | Issue : 025 | Sunday | 19-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri

## నేనున్నంత వరకు బీఆర్ఎస్

# అధికారంలోకి రావడం కల్ల

» నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు
» అందెశ్రీ, గద్దర్‌ను కేసీఆర్ అవమానించారు
» దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ
» స్మృతివనం శంకుస్థాపనలో సీఎం విమర్శలు



వివరాలు2లో..

రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో ప్రముఖ కవి అందెశ్రీ స్మృతివనం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అందెశ్రీ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన మహాకవి అని కొనియాడారు. ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిలా భావించానని చెప్పారు. దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని పేర్కొన్నారు. ఆయన పాటలు లక్షలాది మందిలో ఉద్యమ చైతన్యాన్ని నింపాయని గుర్తు చేశారు.

**అందెశ్రీ, గద్దర్‌కు అవమానం**

అందెశ్రీని గత ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజాకవి గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు వద్ద ఎండలో నిలబెట్టిన ఘటనను గుర్తు చేశారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలైన ఇద్దరు మహనీయులను అవమానించినప్పుడే ప్రజలు పాలకులను తిరస్కరించాలని నిర్ణయించుకున్నారని అన్నారు. ఒకప్పుడు నిషేధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టమని పేర్కొన్నారు.

## ఆహార కల్తీపై ఉక్కుపాదం

◆ ప్రజల ఆరోగ్యమే ముఖ్యం
◆ తెలంగాణలో కఠిన చట్టాలు
◆ సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్

ఆహార పదార్థాలు, ఔషధాల్లో కల్తీని పూర్తిగా అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చట్టం తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిపై రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కల్తీ ఆహారం, నకిలీ మందుల వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు.




# పద్మవ్యూహంలో.. అభిమన్యుడు

» అగ్రరాజ్యంలో అంతులేని కష్టాలు..
» చక్రబంధంలో చిక్కుకున్న జీవచ్ఛవాలు
» అడ్డం తిరిగిన అమెరికా కథ..
» అంధకారంలో భారత విద్యార్థుల వ్యథ

విమానంలో ఎక్కిన రోజు అందరూ చప్పట్లు కొట్టారు. "మా బిడ్డ అమెరికా వెళ్లాడు" అంటూ తల్లిదండ్రుల కళ్లలో గర్వం మెరిసింది. కానీ ఆ విమానం ఎగిరిపోయిన క్షణమే ఒక కుటుంబం రెండు ఖండాలుగా విడిపోయింది. అక్కడ డాలర్లు వచ్చాయి. ఇక్కడ పండుగలు ఖాళీ అయ్యాయి. అక్కడ పెద్ద ఇళ్లు వచ్చాయి. ఇక్కడ తల్లిదండ్రుల గదులు వెలవెలబోయాయి. అక్కడ ఉద్యోగం దొరికింది. ఇక్కడ అమ్మ చేతి వంట జ్ఞాపకంగా మిగిలింది. ఫోన్ స్క్రీన్‌లో నవ్వులు కనిపించాయి. కాల్ ముగిసిన తర్వాత నిశ్శబ్దం మాత్రమే మిగిలింది. అనారోగ్యం వచ్చినా పక్కన ఉండే భుజం లేదు. కన్నీళ్లు వచ్చినా తుడిచే చేయి లేదు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలోకి అడుగు పెడుతున్నారు. పిల్లలు గ్రీన్ కార్డ్ క్యూలో నిలబడి జీవితాన్ని గడుపుతున్నారు. మధ్యలో వేల కిలోమీటర్ల దూరం కాదు... తిరిగి చేరుకోలేని కాలమే నిలబడి ఉంది. ఒకప్పుడు అమెరికా వెళ్లడం విజయానికి నిర్వచనం. ఇప్పుడు అదే ప్రయాణం చాలా కుటుంబాలకు మౌన యుద్ధంగా మారుతోంది. మహాభారతంలో అభిమన్యుడు పద్మవ్యూహంలోకి ఎలా వెళ్లాలో మాత్రమే తెలుసుకున్నాడు. బయటికి వచ్చే దారి తెలియలేదు. ఈ తరం భారతీయ యువత పరిస్థితి కూడా అలాంటిదే. అమెరికా అనే ఆధునిక పద్మవ్యూహంలో అడుగు పెట్టడం సులభం. కానీ బయటకు రావాలా... అక్కడే ఉండాలా... తిరిగి స్వదేశానికి చేరాలా... ఏ నిర్ణయం తీసుకున్నా ఒక గాయం తప్పదు. ఈ కథ అమెరికాను గురించి కాదు... కల కోసం బయలుదేరి, జీవితాన్నే పణంగా పెట్టిన ఒక తరం ఆవేదన గురించి. - అమెరికా నుంచి ఫణి కిశోర్



2లో..

## రాజన్నకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనన్న జగ్గన్న

**గాంధీ భవన్‌కు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**
**జగ్గారెడ్డితో కలిసి తుంగతుర్తిపై కీలక చర్చ**
**రాహుల్ ప్రధాని లక్ష్యమన్న ఇద్దరు నేతలు**

తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. చాలా రోజుల తర్వాత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గాంధీ భవన్‌కు రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో ఆయన సమావేశమై రాష్ట్ర రాజకీయాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశం అనంతరం ఇద్దరు నేతలు మీడియాతో మాట్లాడారు. తమ లక్ష్యం ఒక్కటేనని, రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడటమే కాంగ్రెస్ ఆశయమని స్పష్టం చేశారు.



2లో..

## కమలంలో సయోధ్య

**ఒకే వేదికపైకి బండి-ఈటల**

**బీజేపీలో విభేదాలకు బ్రేక్**
**• రంగంలోకి అధిష్ఠానం**


తెలంగాణ బీజేపీలో కీలక నేతల మధ్య నెలకొన్న విభేదాలకు తెరదించేందుకు పార్టీ అధిష్ఠానం నేరుగా జోక్యం చేసుకుంది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌తో సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో ఎంపీ కె. లక్ష్మణ్ నివాసంలో జరిగిన ఈ భేటీ గంటకు పైగా సాగింది. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని అభయ్ పాటిల్ సూచించారు. ముఖ్యంగా కరీంనగర్‌కు సంబంధించిన రాజకీయ అంశాల్లో సమన్వయంతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే పార్టీ అంతర్గతంగానే పరిష్కరించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**విభేదాలు లేవన్న లక్ష్మణ్**

సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బీజేపీ నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. అందరి లక్ష్యం ఒక్కటేనని, రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే తమ ధ్యేయమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, బీఆర్ఎస్‌పై విశ్వాసం తగ్గిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు గణనీయంగా పెరుగుతాయని ధీమా వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికలు జరిగే అవకాశమూ ఉందని అభిప్రాయపడ్డారు.

## పదవుల కోసం రాజకీయాలు చేయను

• నేను ఫైటర్‌ని.. మంత్రి పదవిపై క్లారిటీ
• అన్నదమ్ములు ఒకే కుటుంబం ఎలా?
• కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు



3లో..

# నయా హిస్టరీ

**భారత్ అంతరిక్షంలో నవ శకం**

**విక్రమ్-1తో ప్రైవేట్ యుగానికి నాంది**

భారత్ అంతరిక్ష రంగంలో మరో చారిత్రక ఘట్టం నమోదైంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్ 1 రాకెట్ విజయవంతంగా కక్ష్యలోకి చేరి దేశానికి అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చింది. ప్రైవేట్ సంస్థ రూపొందించిన భారత తొలి ఆర్బిటల్ రాకెట్‌గా విక్రమ్ 1 కొత్త చరిత్ర సృష్టించింది. "ఆగమన్" పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం ద్వారా ప్రపంచ అంతరిక్ష ప్రయోగాల రంగంలో భారత ప్రైవేట్ సంస్థల సామర్థ్యాన్ని స్కైరూట్ చాటిచెప్పింది.



2లో..

## లక్షల ఉద్యోగాల హామీలు ఏమయ్యాయి?

**జాబ్ క్యాలెండర్, 2 లక్షల ఉద్యోగాలేవీ?**
**కొలువుల పేరిట కుంభకోణాల మేళా**
**యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ విమర్శలు**

హైదరాబాద్ సరూర్‌నగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఉద్యోగ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన రాహుల్ గాంధీ మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. అశోక్‌నగర్‌లో నిర్వహించిన "చాయ్ పే చర్చా"ను గుర్తు చేస్తూ, అప్పట్లో ఇచ్చిన హామీలను రాహుల్ గాంధీ మర్చిపోయారా అని నిలదీశారు.

## దేశ అంతరిక్ష కలలకు తెలంగాణ బలం

విక్రమ్-1 విజయంపై సీఎం రేవంత్ హర్షం

## టీహబ్ నుంచి అంతరిక్ష విజయగాథ

స్కైరూట్‌కు కేటీఆర్ అభినందనలు



## భూముల కోసం పోరు

**బుల్లెట్ ట్రైన్ భూ సేకరణపై ఉద్రిక్తత • బహదూర్‌గూడలో రైతుల ఆందోళన**


రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం భూ సేకరణ అంశం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తమ భూములను అప్పగించేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. స్పష్టమైన హామీలు, సరైన పరిహారం ప్రకటించిన తర్వాతే భూములు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల నిరసన ఐదో రోజుకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో హైడ్రా అధికారులు భారీగా అక్కడికి చేరుకోవడంతో ఆందోళన మరింత పెరిగింది.

(వివరాలు 2లో..)

## ఆరని మంటలు

**• కారం చల్లి.. కుర్చీలు విసిరేసి • బహదూర్‌గూడలో మళ్లీ ఉద్రిక్తత**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో భూ వివాదం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. ప్రభుత్వ భూమికి హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేయడాన్ని నిరసిస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కొందరు ఆందోళనకారులు పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసిరారు. ఈ ఘటనలో డీసీపీ యోగేశ్ గౌతమ్‌తో పాటు పలువురు సీఐల కళ్లలో కారం పడింది. అనంతరం రైతులకు మద్దతుగా ఉన్న పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ భూమికే ఫెన్సింగ్ వేస్తున్నామని, పంటలకు ఎలాంటి నష్టం కలగలేదని డీసీపీ తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలపాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఉదయం నుంచే రెవెన్యూ, హైడ్రా అధికారులను రైతులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.



7లో..

## జాతీయ అవార్డుల్లో సినీ సంబరం

**72వ జాతీయ అవార్డుల ప్రకటన • మమ్ముట్టికి నాలుగోసారి అవార్డు**

## రక్తానికి రక్తం...

## కంటికి కన్ను.. పంటికి పన్ను

▪ శవపేటికలతో పోస్టర్ విడదలతో కలకలం



3లో..

# లక్షల ఉద్యోగాల హామీలు ఏమయ్యాయి?



**• జాబ్ క్యాలెండర్ ఎక్కడ?**

జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. కొలువుల కుంభమేళా నిర్వహిస్తామని చెప్పి కుంభకోణాల కుంభమేళాగా మార్చారని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు, ప్రైవేట్ రంగంలో 75 శాతం రిజర్వేషన్లు, నిరుద్యోగ యువతకు రుణాలు, విద్యార్థినులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కొత్త యూనివర్సిటీలు, ట్రిపుల్ ఐటీల హామీలు అన్నీ ఏమయ్యాయని వరుస ప్రశ్నలు సంధించారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ఇప్పుడు చిత్తు కాగితంగా మారిపోయిందని ఎద్దేవా చేశారు.

**• యువతను మోసం చేశారన్న ఆరోపణ**

తెలంగాణ యువతను కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ఉద్యోగాలు అడిగితే నిర్బంధాలు, లాఠీచార్జీలు ఎదురవుతున్నాయని అన్నారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాకుండా ఉన్మాద పర్వం కొనసాగుతోందని విమర్శించారు. నిరుద్యోగుల ఆవేదన రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సెంట్రల్ లైబ్రరీ ఘటనలు, ఓయూలో జరిగిన నిర్బంధాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.

**• రాహుల్ గాంధీపై ఘాటు వ్యాఖ్యలు**

ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి తెలంగాణలో జరుగుతున్న పరిస్థితులు కనిపించడం లేదని కేటీఆర్ విమర్శించారు. "మొహబ్బత్ కీ దుకాన్ కాదు... ధోకే కా మకాన్ నడుస్తోంది" అంటూ కాంగ్రెస్ పాలనపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని, తెలంగాణలో మాత్రం ప్రజలు నష్టపోతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు భారీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పుడు వాటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు.

**• యువతకు బీఆర్ఎస్ పిలుపు**

రేపటి తెలంగాణ నిర్మాతలు యువతేనని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే శక్తి యువత చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ విస్మరించిందని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థుల సంక్షేమ పథకాలు, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని అన్నారు. కాంగ్రెస్ మాటలను నమ్మి యువత మోసపోయిందని వ్యాఖ్యానించారు. జరిగిన మోసం గుర్తుంచుకుని భవిష్యత్తులో తగిన రాజకీయ నిర్ణయం తీసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు జవాబు కోరాల్సిన సమయం వచ్చిందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# నేనున్నంత వరకు బీఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల

- నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు
- అందెశ్రీ, గద్దర్‌ను కేసీఆర్ అవమానించారు
- దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ
- స్మృతివనం శంకుస్థాపనలో సీఎం విమర్శలు

**అందెశ్రీ, గద్దర్‌కు అవమానం**

అందెశ్రీని గత ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజాకవి గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు వద్ద ఎండలో నిలబెట్టిన ఘటనను గుర్తు చేశారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలైన ఇద్దరు మహనీయులను అవమానించినప్పుడే ప్రజలు పాలకులను తిరస్కరించాలని నిర్ణయించుకున్నారని అన్నారు. ఒకప్పుడు నిషేధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టమని పేర్కొన్నారు.

**ఉద్యోగాలపై బీఆర్ఎస్‌పై విమర్శలు**

నిరుద్యోగ యువతను మోసం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని సీఎం విమర్శించారు. నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్ష పత్రాలు లీక్ చేయడం తప్ప ఉద్యోగాలు ఇవ్వలేదని ఆరోపించారు. ఉద్యోగాల కోసం ఎన్నో కుటుంబాలు కన్నీళ్లు పెట్టుకున్నాయని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే దాదాపు 70 వేల ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. నియామక పత్రాలను తల్లిదండ్రుల సమక్షంలో అందజేశామని వెల్లడించారు.

**ఫామ్‌హౌస్ రాజకీయాలపై విమర్శలు**

తెలంగాణ ప్రజలు నమ్మి అధికారంలోకి తీసుకొచ్చిన నాయకులు వేల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రానికి భారీ అప్పులు మిగిల్చి ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టారని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబం అపార ఆస్తులు ఎలా సంపాదించిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సంపదను కొద్దిమంది చేతుల్లోకి వెళ్లేలా చేశారని విమర్శించారు.



**• బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాదన్న సీఎం**

తాను ఉన్నంత వరకు బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే పరిస్థితి ఉండదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణను మరోసారి దోచుకునే అవకాశం ఇవ్వబోమని హెచ్చరించారు. ప్రజల ఆశయాలను కాపాడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందెశ్రీ చూపిన మార్గం సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయులను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు, ప్రజా సంక్షేమమే తమ పాలనకు ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసంతో ముందుకు సాగుతూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# ఆహార కల్తీపై ఉక్కుపాదం

- ప్రజల ఆరోగ్యమే ముఖ్యం
- తెలంగాణలో కఠిన చట్టాలు
- సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్

**ప్రపంచ దేశాల విధానాలపై అధ్యయనం**

కల్తీ నిరోధానికి సమర్థవంతమైన చట్టాలు అమలు చేస్తున్న దేశాల విధానాలను అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఉత్తమ విధానాలను పరిశీలించి తెలంగాణకు అనువైన సమగ్ర చట్టాన్ని రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. చట్టం రూపకల్పన తర్వాత అసెంబ్లీలో విస్తృతంగా చర్చించి, ప్రజల అభిప్రాయాలు స్వీకరించిన అనంతరం తుది బిల్లును తీసుకురావాలని స్పష్టం చేశారు.

**సేంద్రియ ఉత్పత్తులపై ప్రత్యేక నిఘా**

సేంద్రియ ఉత్పత్తుల పేరుతో మార్కెట్‌లో భారీ ధరలకు వస్తువులు విక్రయిస్తున్నారని సీఎం పేర్కొన్నారు. అవి నిజంగా సేంద్రియ ఉత్పత్తులేనా అనే విషయాన్ని నిర్ధారించే వ్యవస్థ ప్రస్తుతం బలంగా లేదని అన్నారు. ఇకపై వాటి స్వచ్ఛతను పరిశీలించే ప్రత్యేక ధృవీకరణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. పండ్లు త్వరగా పండేందుకు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు వాడుతున్న రసాయనాలపై కూడా ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు.

**టోల్ ఫ్రీ నంబర్... విజిల్ బ్లోయర్ వ్యవస్థ**

కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి అందించేలా ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. తొలి దశలో క్యూర్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ విధానాన్ని అమలు చేసి, ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని నిర్ణయించారు.

**కల్తీదారులపై ఇక కఠిన చర్యలు**

రసాయన అవశేషాల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆహారం, ఔషధాల్లో కల్తీకి పాల్పడే వారిపై ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టానికి త్వరలో తుది రూపం ఇచ్చి అమల్లోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కొత్త చట్టంతో కల్తీ ఆహారం, నకిలీ ఔషధాలపై సమర్థవంతమైన నియంత్రణ సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు.

# కమలంలో సయోధ్య



- ఒకే వేదికపైకి బండి–ఈటల
- బీజేపీలో విభేదాలకు బ్రేక్
- రంగంలోకి అధిష్ఠానం

తెలంగాణ బీజేపీలో కీలక నేతల మధ్య నెలకొన్న విభేదాలకు తెరదించేందుకు పార్టీ అధిష్ఠానం నేరుగా జోక్యం చేసుకుంది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌తో సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో ఎంపీ కె. లక్ష్మణ్ నివాసంలో జరిగిన ఈ భేటీ గంటకు పైగా సాగింది. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని అభయ్ పాటిల్ సూచించారు. ముఖ్యంగా కరీంనగర్‌కు సంబంధించిన రాజకీయ అంశాల్లో సమన్వయంతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే పార్టీ అంతర్గతంగానే పరిష్కరించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**విభేదాలు లేవన్న లక్ష్మణ్**

సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బీజేపీ నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. అందరి లక్ష్యం ఒక్కటేనని, రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే తమ ధ్యేయమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, బీఆర్ఎస్‌పై విశ్వాసం తగ్గిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు గణనీయంగా పెరుగుతాయని ధీమా వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికలు జరిగే అవకాశమూ ఉందని అభిప్రాయపడ్డారు.

**బండి సంజయ్ భావోద్వేగ వ్యాఖ్యలు**

సమావేశం తర్వాత బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పార్టీ ఆదేశమే తనకు శాసనమని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే తన జీవిత లక్ష్యమని చెప్పారు. హైకమాండ్ ఏ బాధ్యత అప్పగించినా పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తానని వెల్లడించారు. తనకు ఎవరి పట్లా కోపం లేదని, ద్వేషం అసలు లేదని అన్నారు. ఇప్పటివరకు ఎవరిపైనా హైకమాండ్‌కు ఫిర్యాదు చేయలేదని, తనపై ఆరోపణలు వచ్చిన సందర్భాల్లో కూడా బహిరంగ విమర్శలు చేయలేదని చెప్పారు. రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించినప్పుడు కూడా పార్టీ నిర్ణయాన్ని గౌరవించానని గుర్తు చేశారు.

**బీజేపీ నా తల్లి**

బీజేపీ తనకు తల్లిలాంటిదని బండి సంజయ్ భావోద్వేగంగా పేర్కొన్నారు. పార్టీ నేర్పిన క్రమశిక్షణ, సంస్కారాలే తన బలం అని చెప్పారు. తల్లి మాటను ఎప్పుడూ జవదాటనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పదవి కోసం, డబ్బు కోసం తాను ఎప్పుడూ రాజకీయాలు చేయలేదని తెలిపారు. తన జీవితం, పోరాటం, త్యాగాల గురించి తెలంగాణ ప్రజలకు బాగా తెలుసని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కార్యకర్తలు పడిన కష్టాలను దగ్గరగా చూశానని, తెలంగాణ ప్రజల సమస్యలను స్వయంగా గమనించానని చెప్పారు.

**అధికారమే లక్ష్యం**

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజల కష్టాలు తీర్చాలన్నదే తన ఏకైక లక్ష్యమని బండి సంజయ్ స్పష్టం చేశారు. కార్యకర్తల కన్నీళ్లు తుడవాలన్న సంకల్పంతో పనిచేస్తున్నానని తెలిపారు. పార్టీ నిర్ణయాలను సంపూర్ణంగా అమలు చేస్తానని, అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని చెప్పారు. ఈ సమావేశంతో బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య నెలకొన్న విభేదాలకు ముగింపు పలకాలని అధిష్ఠానం ప్రయత్నించినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ నాయకత్వం ఇప్పుడు ఐక్యతకు ప్రాధాన్యం ఇస్తోందనే సంకేతాలు ఈ భేటీ ద్వారా స్పష్టమయ్యాయి.

# తెలంగాణలో అధికారమే లక్ష్యం

- నేతలు ఏకతాటిపైకి రావాలి
- బీజేపీ స్టేట్ ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్

ఎంపీ ధర్మపురి అరవింద్ నివాసంలో జరిగిన అంతర్గత సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభయ్ పాటిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. వ్యక్తుల కంటే పార్టీ గొప్పదని, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి నాయకులంతా ఏకతాటిపైకి రావాలని సూచించారు. అధికారాన్ని సాధించాలంటే ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో బలంగా పోరాడాలని, పార్టీ వ్యవస్థ బలపడితే వ్యక్తులు కూడా అదే దారిలో నడుస్తారని పేర్కొన్నారు. బలమైన సంస్థాగత నిర్మాణం ఏర్పడితే మరింత మంది నాయకులు పార్టీలో చేరుతారని సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం.

# పదవుల కోసం రాజకీయాలు చేయను

## రాజన్నకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనన్న జగ్గన్న

- గాంధీ భవన్‌కు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- జగ్గారెడ్డితో కలిసి తుంగతుర్తిపై కీలక చర్చ
- రాహుల్ ప్రధాని లక్ష్యమన్న ఇద్దరు నేతలు

తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. చాలా రోజుల తర్వాత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గాంధీ భవన్‌కు రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో ఆయన సమావేశమై రాష్ట్ర రాజకీయాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశం అనంతరం ఇద్దరు నేతలు మీడియాతో మాట్లాడారు. తమ లక్ష్యం ఒక్కటేనని, రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడటమే కాంగ్రెస్ ఆశయమని స్పష్టం చేశారు.

**రాజగోపాల్‌కు మంత్రి పదవి ఇవ్వాలి**

జగ్గారెడ్డి మాట్లాడుతూ ఏఐసీసీ ఇచ్చిన హామీ ప్రకారం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని అభిప్రాయపడ్డారు. ఆయనలాంటి సీనియర్ నాయకుడి సేవలను పార్టీ పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రాజగోపాల్ రెడ్డి కీలక నాయకుడని, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో ఆయనకు బలమైన అనుబంధం ఉందని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఆయన పోరాటం చేశారని గుర్తు చేశారు.

రాహుల్ నిర్ణయమే అంతిమం

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు పదవులపై ఎలాంటి ఆశలు లేవని స్పష్టం చేశారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా స్వీకరిస్తానని తెలిపారు. రాహుల్ గాంధీ తీసుకునే నిర్ణయమే తనకు అంతిమమని చెప్పారు. పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని, వ్యక్తిగత పదవుల కోసం తాను ఎదురు చూడనని వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ బలపడేందుకు తన వంతు కృషి కొనసాగిస్తానని పేర్కొన్నారు.

**రాహుల్ ప్రధాని కావాలంటే...**

రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలంటే తెలంగాణలో కాంగ్రెస్ ఎక్కువ పార్లమెంట్ స్థానాలు గెలవాలని జగ్గారెడ్డి అన్నారు. అందుకోసం ప్రతి నాయకుడు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాజగోపాల్ రెడ్డి బృందంతో కలిసి పనిచేస్తే పార్టీకి మరింత బలం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు.

**తుంగతుర్తి అంశంపై స్పష్టత**

ఈ సమావేశంలో తుంగతుర్తి అంశమే ప్రధాన ఎజెండా కాదని ఇద్దరు నేతలు స్పష్టం చేశారు. స్థానిక రాజకీయాల్లో తాము జోక్యం చేసుకోలేదని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. తుంగతుర్తి సమస్యను అక్కడి కాంగ్రెస్ నాయకులే పరిష్కరించుకోవాలని సూచించినట్లు చెప్పారు. తుంగతుర్తి వివాదం ఇప్పటికే ముగిసిన అంశమని పేర్కొన్నారు. సరదాగా స్పందించిన రాజగోపాల్ రెడ్డి, పార్టీ పంచాయితీలు పరిష్కరించే బాధ్యత జగ్గారెడ్డికే అప్పగిస్తే బాగుంటుందని వ్యాఖ్యానించారు. ఈ భేటీతో కాంగ్రెస్‌లో సమన్వయానికి ప్రాధాన్యం పెరుగుతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యమని నేతలు మరోసారి స్పష్టం చేశారు.



- నేను ఫైటర్‌ని.. మంత్రి పదవిపై క్లారిటీ
- అన్నదమ్ములు ఒకే కుటుంబం ఎలా?
- కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

**అన్నదమ్ములు ఒకే కుటుంబం ఎలా?**

కుటుంబానికి సంబంధించిన ప్రశ్నకు రాజగోపాల్ రెడ్డి ఆసక్తికరంగా స్పందించారు. నాన్న, కొడుకు ఒకే కుటుంబమని, భార్యాభర్తలు కూడా ఒకే కుటుంబంగా పరిగణిస్తారని అన్నారు. అయితే అన్నదమ్ములు వేర్వేరు ఇళ్లలో ఉంటే ఒకే కుటుంబంగా ఎలా భావిస్తారని ప్రశ్నించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, పద్మావతి దంపతులు ఒకే కుటుంబమని చెప్పొచ్చని, కానీ తాము అన్నదమ్ములమే తప్ప ఒకే కుటుంబం కాదని వ్యాఖ్యానించారు. తాము వేర్వేరుగా జీవిస్తున్నామని స్పష్టం చేశారు.

**మంత్రి పదవిపై అసంతృప్తి**

ఎన్నికలకు ముందు ఏఐసీసీ ఆరుగురికి మంత్రి పదవుల హామీ ఇచ్చిందని రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. వివేక్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావుకు మంత్రి పదవులు లభించాయని చెప్పారు. అయితే హామీ ఇచ్చిన వారిలో తనకు మాత్రం ఇప్పటికీ అవకాశం రాలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ తాను మంత్రి పదవి కోసం అడిగే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు.

**నేను ఫైటర్‌ని**

తాను ఎప్పుడూ పదవుల కోసం ఎదురు చూసే నాయకుడిని కాదని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. తాను ఫైటర్‌నని, తీసుకునే ప్రతి నిర్ణయం రాజకీయంగా పెద్ద మార్పునకు దారితీసేదేనని అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినప్పుడు వందలాది మంది ఎమ్మెల్యేలు అక్కడికి వచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా తీవ్రంగా దృష్టి పెట్టారని పేర్కొన్నారు. తన రాజకీయ నిర్ణయాలకు ఎప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు.

**ప్రజల కోసమే రాజకీయాలు**

తన రాజకీయ ప్రయాణంలో పదవుల కంటే ప్రజల కోసం చేసే పోరాటానికే విలువ ఇస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. హక్కుల కోసం నిలబడటమే తన రాజకీయ సిద్ధాంతమని తెలిపారు. తనకు మంత్రి పదవి రాకపోయినా ఎలాంటి నిరాశ లేదని, పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తానని చెప్పారు. ప్రస్తుతం తన దృష్టంతా కాంగ్రెస్ బలోపేతంపైనే ఉందని వెల్లడించారు. పార్టీ బలపడటం, ప్రజల నమ్మకం గెలుచుకోవడమే ముఖ్యమన్నారు.

# భూముల కోసం పోరు

- బుల్లెట్ ట్రైన్ భూ సేకరణపై ఉద్రిక్తత
- బహదూర్‌గూడలో రైతుల ఆందోళన

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం భూ సేకరణ అంశం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తమ భూములను అప్పగించేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. స్పష్టమైన హామీలు, సరైన పరిహారం ప్రకటించిన తర్వాతే భూములు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల నిరసన ఐదో రోజుకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో హైడ్రా అధికారులు భారీగా అక్కడికి చేరుకోవడంతో ఆందోళన మరింత పెరిగింది.

**రైతుల ఆగ్రహం**

రతరాలుగా సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములను బుల్లెట్ ట్రైన్ పేరుతో తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారుల నుంచి ఒత్తిళ్లు, బెదిరింపులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ జీవనాధారమైన భూములను కోల్పోయే పరిస్థితిని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని స్పష్టం చేస్తున్నారు. భూముల జోలికి వస్తే తీవ్ర నిరసన తప్పదని హెచ్చరిస్తున్నారు.

**బీఆర్ఎస్ మద్దతు**

రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మద్దతు ప్రకటించారు. బహదూర్‌గూడ భూముల విషయంలో ప్రస్తుతం స్టేటస్‌కో అమల్లో ఉందని, జిల్లా కలెక్టర్ కోర్టు అనుమతి లేకుండా అధికారులు భూముల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజల కోసం పనిచేయాల్సిన ప్రభుత్వం భయపెట్టే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతుల భూములను బలవంతంగా తీసుకునే ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.


**రైతుల పక్షాన పోరాటం**



రైతులకు అన్యాయం జరగకుండా చివరి వరకు పోరాడతామని కార్తీక్ రెడ్డి హామీ ఇచ్చారు. అవసరమైతే ఏ స్థాయికైనా వెళ్లి రైతుల హక్కులను కాపాడతామని తెలిపారు. భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునే అవకాశం లేదని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, భవిష్యత్తులో రైతుల హక్కులను కాపాడేందుకు తమ పార్టీ కట్టుబడి ఉంటుందని చెప్పారు. బహదూర్‌గూడ భూ సేకరణ వ్యవహారం ప్రస్తుతం రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. రైతుల ఆందోళన కొనసాగుతుండటంతో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం ఆసక్తిగా మారింది.

# రక్తానికి రక్తం

- కంటికి కన్ను.. పంటికి పన్ను
- ట్రంప్ ఫ్యామిలీకి ఇరాన్ డెడ్లీ వార్నింగ్
- శవపేటికలతో పోస్టర్ విడుదలతో కలకలం




మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు మరింత ప్రమాదకర దశకు చేరుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకున్న భారీ పోస్టర్‌ను ఇరాన్ రాజధాని టెహ్రాన్ నడిబొడ్డున ఏర్పాటు చేయడం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. "రక్తానికి రక్తం" అనే నినాదంతో రూపొందించిన ఈ పోస్టర్‌లో ట్రంప్, ఆయన భార్య మెలానియా, పిల్లలు ఇవాంకా, డొనాల్డ్ జూనియర్, ఎరిక్, టిఫనీ, బారన్‌ల చిత్రాలను అమెరికా జెండాలతో కప్పిన శవపేటికలపై చూపించారు. నేపథ్యంలో మంటల్లో చిక్కుకున్న వైట్ హౌస్ దృశ్యాన్ని చిత్రీకరించారు.

### ప్రచార యుద్ధానికి కొత్త రూపం

ఇరాన్‌లో రాజకీయ సందేశాల కోసం భారీ బిల్‌బోర్డులను వినియోగించడం కొత్త విషయం కాదు. అయితే అమెరికా-ఇజ్రాయెల్ సైనిక చర్యల నేపథ్యంలో ఈ ప్రచారం మరింత దూకుడుగా మారింది. గతంలో కూడా ట్రంప్ శవపేటికలో ఉన్నట్లు చూపించిన పోస్టర్‌ను టెహ్రాన్‌లో ఏర్పాటు చేశారు. ఇప్పుడు కుటుంబ సభ్యులను కూడా చేర్చడం ద్వారా ఉద్రిక్తతను మరింత పెంచే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ బిల్‌బోర్డులు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కు అనుబంధంగా ఉన్న ఓవ్జ్ ఆర్ట్స్ అండ్ మీడియా సంస్థ ఆధ్వర్యంలో రూపొందుతున్నట్లు సమాచారం.

### ప్రతీకార హెచ్చరికలు తీవ్రం


ఇరాన్ అత్యున్నత నాయకత్వం నుంచి ప్రతీకార హెచ్చరికలు వరుసగా వెలువడుతున్నాయి. తమ నాయకుడి హత్యకు బాధ్యులైన వారిపై ప్రతీకారం తప్పదని స్పష్టం చేశారు. "వాళ్లు ప్రశాంతంగా మరణించే అదృష్టం పొందరు" అంటూ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర చర్చకు కారణమయ్యాయి. ప్రభుత్వ అనుకూల మీడియా కూడా ఇదే సందేశాన్ని బలంగా ప్రచారం చేస్తోంది. దీంతో రెండు దేశాల మధ్య మాటల యుద్ధం మరింత ఉధృతమైంది.

### ట్రంప్ కఠిన హెచ్చరిక

ఇరాన్ తనపై హత్యాయత్నం విజయవంతమైతే అపూర్వ స్థాయిలో బాంబుదాడులు చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చానని ట్రంప్ వెల్లడించారు. చాలా కాలంగా తాను ఇరాన్ లక్ష్య జాబితాలో ఉన్నానని పేర్కొన్నారు. అమెరికా భద్రతా వ్యవస్థ కూడా ట్రంప్ రక్షణను మరింత కట్టుదిట్టం చేసింది. నాటో సమావేశం అనంతరం ఆయన ప్రయాణ ప్రణాళికలను చివరి నిమిషంలో మార్చడం కూడా భద్రతా చర్యల్లో భాగంగానే జరిగినట్లు వైట్ హౌస్ తెలిపింది.

### యుద్ధ భయం మళ్లీ పెరుగుతోంది

ఇజ్రాయెల్‌కు భారీ సంఖ్యలో గాల్లో ఇంధనం నింపే విమానాలను అమెరికా పంపుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అవసరమైతే ఇరాన్‌పై విస్తృత సైనిక చర్యలకు అమెరికా సిద్ధమవుతోందన్న వార్తలు ఆందోళన పెంచుతున్నాయి. ఒకవైపు ఇరాన్ బహిరంగ ప్రతీకార హెచ్చరికలు, మరోవైపు అమెరికా సైనిక సన్నాహాలు కొనసాగుతున్న పరిస్థితుల్లో మధ్యప్రాచ్యం మరోసారి యుద్ధ అంచున నిలిచిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ దేశాలు ఈ పరిణామాలను అత్యంత అప్రమత్తంగా గమనిస్తున్నాయి.




# నయా హిస్టరీ

## భారత్ అంతరిక్షంలో నవ శకం విక్రమ్ 1తో ప్రైవేట్ యుగానికి నాంది

భారత్ అంతరిక్ష రంగంలో మరో చారిత్రక ఘట్టం నమోదైంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్ 1 రాకెట్ విజయవంతంగా కక్ష్యలోకి చేరి దేశానికి అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చింది. ప్రైవేట్ సంస్థ రూపొందించిన భారత తొలి ఆర్బిటల్ రాకెట్‌గా విక్రమ్ 1 కొత్త చరిత్ర సృష్టించింది. "ఆగమన్" పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం ద్వారా ప్రపంచ అంతరిక్ష ప్రయోగాల రంగంలో భారత ప్రైవేట్ సంస్థల సామర్థ్యాన్ని స్కైరూట్ చాటిచెప్పింది.

### ఉత్కంఠ తర్వాత విజయోత్సాహం

శ్రీహరికోటలో ఉదయం 11:30 గంటలకు జరగాల్సిన ప్రయోగాన్ని సాంకేతిక కారణాలతో కొద్దిసేపు నిలిపివేశారు. పూర్తి స్థాయి పరిశీలన తర్వాత మధ్యాహ్నం 12:05 గంటలకు రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. సుమారు 12:21 గంటలకు ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు మిషన్ బృందం ప్రకటించింది. "హలో స్పేస్... మేము వచ్చేశాం" అంటూ ప్రకటించిన క్షణం అక్కడ ఉన్న శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు.

### అత్యాధునిక సాంకేతికత ప్రత్యేకత

ఏడు అంతస్తుల భవనం ఎత్తుతో రూపొందించిన విక్రమ్ 1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. స్కైరూట్ స్వయంగా అభివృద్ధి చేసిన త్రిమితీయ ముద్రణ సాంకేతికతతో తయారైన ఇంజిన్లు, అధిక శక్తి ఘన ఇంధన బూస్టర్లు ఇందులో వినియోగించారు. తక్కువ భూ కక్ష్యలో 350 కిలోల వరకు బరువున్న చిన్న ఉపగ్రహాలను మోసుకెళ్లే సామర్థ్యం ఈ రాకెట్‌కు ఉంది. తొలి ప్రయోగంలో 450 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యను లక్ష్యంగా పెట్టుకుంది.

### ప్రత్యేక సందేశాలతో అంతరిక్ష యానం

ఈ మిషన్‌లో గ్రహా స్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ సంస్థల సాంకేతిక పేలోడ్‌లతో పాటు స్కైరూట్ రూపొందించిన స్కోప్ పేలోడ్‌ను కూడా పంపించారు. ప్రముఖ శాస్త్రవేత్తలు సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూక్ష్మ శిల్పాలను కూడా అంతరిక్షంలోకి తీసుకెళ్లారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో రాసిన "వందే మాతరం" సందేశం కూడా ఈ ప్రయాణంలో భాగమైంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు పంపిన శుభాకాంక్షల కార్డులు కూడా రాకెట్‌లో చోటు దక్కించుకున్నాయి.

### భారత యువతకు కొత్త స్ఫూర్తి

ప్రయోగం విజయవంతం కావడంతో ప్రధాని నరేంద్ర మోదీ స్కైరూట్ సీఈఓ పవన్ కుమార్ చందనకు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. "మీరు భారత గర్వాన్ని అంతరిక్షంలో నాటారు. యువత కలలకు బలమైన పునాది వేశారు" అంటూ ప్రశంసించారు. స్కైరూట్ బృందం సగటు వయస్సు కేవలం 28 సంవత్సరాలేనని వెల్లడించారు. యువ శాస్త్రవేత్తల ప్రతిభకు విక్రమ్ 1 విజయవంతమైన ప్రయోగం నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థలకు ఇది కొత్త అవకాశాల ద్వారం తెరిచిన చారిత్రక మైలురాయిగా నిలిచింది.

## దేశ అంతరిక్ష కలలకు తెలంగాణ బలం

### విక్రమ్-1 విజయంపై సీఎం రేవంత్



భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ విక్రమ్ 1 విజయవంతంగా ప్రయోగం కావడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. "హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్" అంటూ ఎక్స్ వేదికగా స్పందించారు. శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లిన విక్రమ్ 1తో హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ చారిత్రక విజయాన్ని సాధించిందని పేర్కొన్నారు. భారత అంతరిక్ష రంగంలో ఇది మరో కీలక మైలురాయిగా నిలిచిందన్నారు. దేశ అంతరిక్ష కలలకు తెలంగాణ చిరునామాగా మారిందని, హైదరాబాద్ ఆవిష్కరణ శక్తికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించిందని తెలిపారు. స్కైరూట్ బృందానికి అభినందనలు తెలియజేస్తూ, ప్రైవేట్ స్పేస్ రంగంలో భారత్ సత్తా చాటిందని కొనియాడారు. భవిష్యత్ అంతరిక్ష ప్రయాణాలకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడిందని పేర్కొన్నారు.

### టీహబ్ నుంచి అంతరిక్ష విజయగాథ

### స్కైరూట్‌కు కేటీఆర్ అభినందనలు



టీహబ్‌లో పుట్టిన స్కైరూట్ సంస్థ చేపట్టిన విక్రమ్ 1 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సులో ఆయన మాట్లాడుతూ, భారత అంతరిక్ష చరిత్రలో తొలి ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించిన సంస్థ టీహబ్ నుంచి ఎదగడం తెలంగాణకు గర్వకారణమన్నారు. స్కైరూట్ విజయం రాష్ట్ర ఆవిష్కరణ శక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. సంస్థ శాస్త్రవేత్తలు, బృందానికి చప్పట్లతో అభినందనలు తెలియజేయాలని విద్యార్థులు, నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. ఇస్రో నుంచి తొలి ప్రైవేట్ రాకెట్ విజయవంతంగా ప్రయోగం కావడంతో స్కైరూట్ కంట్రోల్ సెంటర్‌లో సంబరాలు నెలకొన్నాయి.

# విక్రమ్-1 విజయగర్జన

### దేశమంతా హర్షధ్వానాలు

భారత తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్ 1' విజయవంతం కావడంతో దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి 'మిషన్ ఆగమన' పేరుతో ప్రయోగించిన ఈ రాకెట్ అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేసి భారత అంతరిక్ష రంగంలో కొత్త చరిత్ర సృష్టించింది. ఈ విజయంతో ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేట్ సంస్థలు కూడా అత్యాధునిక అంతరిక్ష ప్రయోగాలు నిర్వహించే సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాయి. ఈ ఘనతపై ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు ప్రముఖులు స్కైరూట్ ఏరోస్పేస్ బృందాన్ని అభినందించారు.

### స్కైరూట్ బృందానికి ప్రధాని అభినందనలు

ప్రయోగం విజయవంతమైన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించానని పేర్కొంటూ, యువ ఇంజినీర్ల కృషి ఫలితమే ఈ విజయం అని కొనియాడారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇది కీలక మైలురాయని అభివర్ణించారు. 'ఇది ఆరంభం మాత్రమే. ఇంకా ఎన్నో విజయాలు సాధించాలి' అంటూ శాస్త్రవేత్తలను ప్రోత్సహించారు. త్వరలో తనను కలిసి ఈ విజయాన్ని పంచుకోవాలని స్కైరూట్ బృందాన్ని ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఈ ప్రయోగం బలమైన నిదర్శనమని పేర్కొన్నారు. 'విక్రమ్ 1'లో పంపిన తన 'వందే మాతరం' సందేశం అంతరిక్షానికి చేరడం గర్వకారణమని చెప్పారు.

### చంద్రబాబు ప్రశంసలు

'విక్రమ్ 1' తొలి ప్రయోగంలోనే విజయం సాధించడం భారతదేశానికి మరో చారిత్రక మైలురాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్‌స్పేస్, ఎన్ఎస్ఐఎల్ సంస్థలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ప్రపంచ అగ్రదేశాలతో పోటీ పడే స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. శాస్త్రవేత్తల ప్రతిభ, పారిశ్రామికవేత్తల సృజనాత్మకత కలిసినప్పుడు ఇలాంటి అద్భుత విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. ఈ విజయం భావితరాల యువ శాస్త్రవేత్తలకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### పవన్, లోకేశ్ హర్షం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'విక్రమ్ 1' ప్రయోగాన్ని భారత అంతరిక్ష చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా అభివర్ణించారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో దేశంలో ఆవిష్కరణలకు కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని చెప్పారు. ఇస్రో పోషించిన పాత్రను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, ఈ విజయం భారతీయ యువతకు గొప్ప ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ కూడా ప్రయోగ విజయంపై హర్షం వ్యక్తం చేశారు. 350 కిలోల ఉపగ్రహాలను లో ఎర్త్ ఆర్బిట్‌లోకి తీసుకెళ్లిన 'విక్రమ్ 1' భారత అంతరిక్ష పరిశోధనలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని తెలిపారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన ఈ విజయం దేశ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందని కొనియాడారు.

## ప్రజాకవి అందెశ్రీకి ఘన నివాళి

### స్మృతి వనానికి శ్రీకారం

ప్రజాకవి డాక్టర్ అందెశ్రీకి తమ ప్రభుత్వం అపూర్వ గౌరవం ఇచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మేడ్చల్ జిల్లా 4ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతి వనానికి సీఎం రేవంత్ రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. అందెశ్రీ కుటుంబానికి ఇచ్చిన ఐదు హామీలన్నింటినీ అమలు చేశామని వెల్లడించారు. ఆయన కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు, 'నిప్పుల వాగు' పుస్తకాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలో ముద్రిస్తున్నామని చెప్పారు. అందెశ్రీకి పద్మశ్రీ పురస్కారం ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేసినట్లు తెలిపారు. 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర గీతంగా ప్రకటించడం కూడా ఆయనకు ఇచ్చిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు.

## బోనాల చేతివృత్తుల మేళాకు విశేష స్పందన

- స్థానిక ఉత్పత్తులు కొనాలని మంత్రి పిలుపు

హైదరాబాద్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో నిర్వహిస్తున్న 'బోనాలు-చేతివృత్తుల మేళా'కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 16 నుంచి 26 వరకు జరుగుతున్న మేళాలో చేనేత వస్త్రాలు, మట్టిపాత్రలు, వెదురు ఉత్పత్తులు, స్వగృహ ఆహార పదార్థాలు, తెలంగాణ సంప్రదాయ వంటకాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మొత్తం 60 స్టాల్స్ ఏర్పాటు చేసి స్థానిక కళాకారులకు మార్కెట్ కల్పిస్తున్నారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనతో స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేసి చేతివృత్తి కళాకారులను ప్రోత్సహించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## దీక్షలోకి అభిజీత్ దీప్కే

- ఆస్పత్రిలో వాంగ్‌చుక్ ఉద్యమం

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించినా ఉద్యమం ఆగదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. వాంగ్‌చుక్‌కు మద్దతుగా తాను నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. జులై 20న నిర్వహించనున్న 'చలో సంసద్' మార్చ్ యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు. మరోవైపు నిరాహార దీక్ష కారణంగా వాంగ్‌చుక్ డీహైడ్రేషన్‌కు గురయ్యారని, ఆయనకు నిరంతర వైద్య పర్యవేక్షణ అవసరమని వైద్యులు తెలిపారు. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేయగా, వైద్య వివరాలు ఇవ్వలేదంటూ వాంగ్‌చుక్ కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

## నల్లగొండలో విషాదం

- ప్రేమ వ్యవహారంలో ఇద్దరి మృతి

నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం మునుకుంట్ల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఎంబీబీఎస్ తొలి సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థిని ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందగా, ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడు చరణ్ కూడా గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. ఒకే రోజు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. యువతి మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో చరణ్ పాత్రపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించి, అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

## పంచదార్ల కొండలపై అక్రమ మైనింగ్..

- కూటమిపై అమర్‌నాథ్ విమర్శలు

కూటమి పాలనలో దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయిందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. అనకాపల్లి జిల్లా పంచదార్ల కొండపై జరుగుతున్న అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తుల రిలే నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఎంపీ సీఎం రమేష్ కొండలను దోచుకుంటున్నారని విమర్శించారు. 1,200 ఏళ్ల చరిత్ర కలిగిన పంచదార్ల కొండలను కాపాడాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌ను వెంటనే నిలిపివేసి, 30 కిలోమీటర్ల పరిధిని 'నో మైనింగ్ జోన్'గా ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రభుత్వాన్ని కోరారు.

## విద్యార్థినుల వేధింపుల ఆరోపణలు..

- ఇద్దరు ఉపాధ్యాయుల తొలగింపు

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కొత్తబాది మోడల్ స్కూల్‌లో విద్యార్థినుల వేధింపుల ఆరోపణలు కలకలం రేపాయి. కాంట్రాక్టు ఉపాధ్యాయులు గోపాల్, పవన్ తమతో అసభ్యంగా ప్రవర్తించారని పలువురు విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. ఘటనను తీవ్రంగా పరిగణించిన విద్యాశాఖ అధికారులు పాఠశాలలో విచారణ నిర్వహించారు. ప్రాథమిక దర్యాప్తులో ఆరోపణలకు ఆధారాలు లభించడంతో ఇద్దరు ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగించారు. ఘటనపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ విద్యార్థుల భద్రతకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పాతబస్తీలో ఫుడ్ సెంటర్లపై దాడులు

### భారీగా నాసిరకం ఆహారం స్వాధీనం



హైదరాబాద్ పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. తనిఖీల్లో అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం తయారు చేస్తున్నట్లు గుర్తించారు. వాడిన వంటనూనెను మళ్లీ వినియోగించడం, కృత్రిమ రంగులు కలిపిన చికెన్ విక్రయించడం బయటపడింది. అధికారులు 20 లీటర్ల వాడిన నూనె, 40 కిలోల ఫ్రైడ్ చికెన్, 40 కిలోల రంగు కలిపిన చికెన్, సింథటిక్ ఫుడ్ కలర్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసులు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని చాంద్రాయణగుట్ట పోలీసులకు అప్పగించారు.

## ఆసియా అథ్లెటిక్స్‌లో బంగారు పతకం

- ప్రవల్లికకు సీఎం అభినందనలు

చైనాలో జరిగిన తొలి ఆసియా అండర్23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 4×400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని నరిమళ్ల ప్రవల్లికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ప్రవల్లిక సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ప్రతిభను కొనియాడిన సీఎం, తెలంగాణ క్రీడలకు కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రవల్లిక విజయం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవానికి భారీ ఏర్పాట్లు

ఈ నెల 21న జరిగే బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం, 22న నిర్వహించే రథోత్సవం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేసి తోపులాట జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆలయ పరిసరాల్లో అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి పరిశుభ్రతను కాపాడాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## బాణసంచా కర్మాగారంలో ఘోర పేలుడు : 8 మంది మృతి

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 8 మంది దుర్మరణం చెందగా, 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. రామోల్‌గత్రాడ్ రోడ్డులో జరిగిన ఈ ప్రమాదంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది ముందుగా సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆస్పత్రులకు తరలించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనుమతులు లేకుండానే కర్మాగారం నడుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేసి, మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

### శిశువు కిడ్నాప్ ముఠా గుట్టురట్టు.. ఐదుగురు అరెస్ట్

హైదరాబాద్‌లో శిశువుల అక్రమ రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు ఛేదించారు. చందానగర్‌లో తల్లి ఒడిలో నుంచి నెల రోజుల పసికందును కిడ్నాప్ చేసి రూ.1.50 లక్షలకు విక్రయించేందుకు ప్రయత్నించిన ఐదుగురిని అరెస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్‌కు తరలించే కుట్రను పోలీసులు భగ్నం చేశారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో ప్రత్యేక బృందాలు వేగంగా దర్యాప్తు చేసి శిశువును సురక్షితంగా రక్షించి కన్నతల్లికి అప్పగించాయి. ఈ ముఠాకు ఇతర రాష్ట్రాలతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## జోర్డాన్‌లో ఇరాన్ దాడులు

- ఇద్దరు అమెరికా సైనికుల మృతి

జోర్డాన్‌లో ఇరాన్ క్షిపణులు, డ్రోన్ దాడులను అడ్డుకునే క్రమంలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించగా, మరో సైనికుడు గల్లంతైనట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. నలుగురు సైనికులు గాయపడినా చికిత్స అనంతరం విధుల్లో చేరినట్లు తెలిపింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి మరణించిన అమెరికా సైనికుల సంఖ్య 16కు చేరగా, 430 మందికిపైగా గాయపడ్డారు. ఇదే సమయంలో ఇరాన్ అత్యున్నత నాయకుడు మొజ్తబా ఖమేనీ అమెరికాకు "మరచిపోలేని పాఠాలు" నేర్పుతామని హెచ్చరించారు. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చాయి.

ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి
4
GENERAL NEWS
ఆదివారం 19 జులై 2026
www.prabhathakiranam.com

# చైనా బ్యాంకుల దూకుడు

- భారత్‌కు హెచ్చరిక గంటలు
- టాప్-10లో ఏడు చైనా బ్యాంకులే

ప్రపంచ బ్యాంకింగ్ రంగంలో చైనా తన ఆధిపత్యాన్ని మరింత బలపరుస్తోంది. 2026లో విడుదలైన అంతర్జాతీయ బ్యాంకుల ర్యాంకింగ్స్ ప్రకారం ప్రపంచంలోని టాప్10 అతిపెద్ద బ్యాంకుల్లో ఏకంగా ఏడు చైనా బ్యాంకులే ఉన్నాయి. ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా (ICBC), చైనా కన్‌స్ట్రక్షన్ బ్యాంక్, అగ్రికల్చరల్ బ్యాంక్ ఆఫ్ చైనా, బ్యాంక్ ఆఫ్ చైనా తొలి నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ప్రపంచ టాప్100లో 22 చైనా బ్యాంకులు చోటు దక్కించుకోగా, భారతీయ బ్యాంకులు మాత్రం ఆ స్థాయికి చేరుకోలేకపోయాయి. ఈ పరిణామం ప్రపంచ ఆర్థిక శక్తి తూర్పు వైపు మరింతగా కేంద్రీకృతమవుతోందనే సంకేతాలను ఇస్తోంది.

### చైనా వ్యూహం.. భారత్‌కు సవాలు

చైనా బ్యాంకుల బలం కేవలం భారీ మూలధనమే కాదు. దేశీయ పొదుపులను మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక రంగం, భారీ ప్రాజెక్టులకు మళ్లిస్తూ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్తోంది. మరోవైపు అంతర్జాతీయ చెల్లింపుల కోసం అమెరికా ఆధిపత్యంలోని డాలర్ వ్యవస్థపై ఆధారాన్ని తగ్గించేందుకు క్రాస్‌బోర్డర్ ఇంటర్‌బ్యాంక్ పేమెంట్ సిస్టమ్‌ను బలోపేతం చేస్తోంది. భవిష్యత్తులో ఆర్థిక ఆంక్షలను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుకోవడమే చైనా ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

### భారత్ ఏం చేయాలి?

భారత్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి పెద్ద బ్యాంకులు ఉన్నప్పటికీ ప్రపంచ స్థాయిలో ప్రభావం చూపే స్థాయికి ఇంకా ఎదగలేదు. భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడం, పొరుగు దేశాలకు ఆర్థిక సహకారం అందించడం, రూపాయి ఆధారిత అంతర్జాతీయ చెల్లింపుల వ్యవస్థను విస్తరించడం వంటి అంశాల్లో మరింత దూకుడు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచ బ్యాంకింగ్‌లో పోటీ కేవలం బ్యాంకుల




పరిమాణంతో కాదు, ఆర్థిక ప్రభావం, చెల్లింపుల వ్యవస్థలు, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లతోనూ నిర్ణయించబడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ తన బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



## పవన్‌ను పరామర్శించిన లోకేశ్
# త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల ముంబయిలో కుడి భుజానికి రొటేటర్ కఫ్ గాయానికి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కనకదుర్గ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేసి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలను తప్పకుండా పాటించాలని, పూర్తిస్థాయిలో కోలుకునే వరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అనంతరం ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్న లోకేశ్, పవన్ అన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సమావేశాల సమయంలో అభిమానులు పదేపదే చేయి పట్టుకోవడంతో పవన్ కుడి భుజానికి తీవ్ర గాయం కావడంతో ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో శస్త్రచికిత్స జరిగింది. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్నారు.


5లో..

## ఢిల్లీలో పెరుగుతున్న ఉత్కంఠ

- వాంగ్‌చుక్‌ను ఆస్పత్రికి తరలింపు
- ఐనా దీక్ష ఆపేదేలేదంటున్న సీజేపీ
- 21వ రోజుకు చేరిన నిరాహార దీక్ష

ప్రముఖ పర్యావరణవేత్త సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 21వ రోజుకు చేరడంతో దేశ రాజధాని ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తున్న వాంగ్‌చుక్‌ను ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా పోలీసులు సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చేరిన తర్వాత కూడా ఆయన నిరాహార దీక్షను కొనసాగిస్తున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. జూలై 20న జరగనున్న "చలో పార్లమెంట్" కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చినట్లు తెలిపారు.



## స్టార్ హీరోలకు హితవు

- ఏపీ మీద ప్రేమ లేదా?
- రాష్ట్రంలో షూటింగ్స్ చేయాలి
- అంబికా కృష్ణ సంచలన వ్యాఖ్యలు

ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ బలోపేతం కావాలంటే అగ్రహీరోలు తమ చిత్రాల షూటింగ్‌లను రాష్ట్రంలో నిర్వహించాలని సినీ నిర్మాత, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ పిలుపునిచ్చారు. (వివరాలు 7లో..)

# గాంధీ జయంతికల్లా చెత్తకు గుడ్‌బై

గాంధీ జయంతి నాటికి రాష్ట్రాన్ని చెత్త రహితంగా మార్చడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గుడివాడలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెత్తను సమస్యగా కాకుండా సంపదగా మార్చాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 108 సమగ్ర ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటుకు రూ.528 కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఆగస్టు 26 నాటికి 1,140 ఎలక్ట్రిక్ చెత్త సేకరణ వాహనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్న సీఎం, ప్రతి కుటుంబం చెత్త నిర్వహణలో భాగస్వామ్యం కావాలని కోరారు. తడి చెత్తతో కంపోస్ట్ తయారు చేసుకోవాలని సూచించారు. ఈ నెలలోనే 'తల్లికి వందనం' పథకం నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. రౌడీయిజానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వబోమని హెచ్చరించారు. ప్రజల జీవితాలతో ఆటలాడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అమృత్ 2.0 శిలాఫలకాన్ని ఆవిష్కరించి స్వచ్ఛ అవార్డులు అందజేశారు. అమరావతి అభివృద్ధికి సాయిశ్వేత తన బంగారు గాజులు విరాళంగా ఇవ్వగా, గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి అన్నే నరసింహారావు దంపతులు రూ.3 కోట్ల విరాళం ప్రకటించారు.




## వాంగ్‌చుక్‌తో చర్చించండి
### కేంద్రానికి అన్నా హజారే సూచన



సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్షపై ప్రముఖ ఉద్యమకారుడు అన్నా హజారే కేంద్ర ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. వాంగ్‌చుక్ సహనాన్ని పరీక్షించవద్దని, ఆయన డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. "అవును లేదా కాదు అని చెప్పండి.. కానీ చర్చలు జరపడంలో తప్పేంటి?" అంటూ వీడియో సందేశంలో ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో సమస్యలకు సంభాషణ ద్వారానే పరిష్కారం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వాంగ్‌చుక్ 21 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. శనివారం ఢిల్లీ జంతర్‌మంతర్ నుంచి ఆయనను పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నవేళ అన్నా హజారే స్పందన ప్రాధాన్యం సంతరించుకుంది. 2011లో లోక్‌పాల్ చట్టం కోసం అన్నా హజారే చేసిన నిరాహార దీక్ష అప్పటి యూపీఏ ప్రభుత్వాన్ని కుదిపేసిన విషయం తెలిసిందే.



## రావణ్‌కు మరోసారి షాక్
### రిమాండ్ గడువు పొడిగించిన కోర్టు


యూట్యూబర్ 'ప్రశ్న' రావణ్‌కు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన రిమాండ్ గడువును గన్నవరం కోర్టు మరోసారి పొడిగించింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హిందూ మతంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసుతో పాటు యూఏపీఏ కింద నమోదైన కేసులో ప్రస్తుతం రావణ్ రిమాండ్‌లో ఉన్నారు. (వివరాలు 5లో..)


7లో..

## గుంటూరులో దారుణం

- మహిళను వివస్త్ర చేసి దాడి
- నీళ్ల గొడవ.. అమానవీయ ఘటన
- సభ్య సమాజాన్ని కలచివేసిన ఘటన

గుంటూరు నగరంలో మహిళపై జరిగిన అమానవీయ దాడి తీవ్ర సంచలనం రేపింది. నీటి పైప్‌లైన్ వివాదం చివరకు దారుణ ఘటనకు దారితీసింది. నగరంలోని నగరంపాలెం పరిధిలోని కృష్ణబాబు కాలనీలో 46 ఏళ్ల మహిళను ఇంటి నుంచి ఈడ్చుకొచ్చి నడిరోడ్డుపై వివస్త్ర చేసి దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలకు కారణమైంది. మహిళ గౌరవాన్ని కించపరిచేలా జరిగిన ఈ దాడిని స్థానికులు తీవ్రంగా ఖండిస్తున్నారు.


5లో..

## లక్షన్నర కోట్లు బొక్క

- అమెరికాకు వరల్డ్ కప్ షాక్
- ప్రపంచకప్ జోష్... పనికి బ్రేక్
- ఫుట్‌బాల్ మోజు... ఆర్థిక ప్రభావం

ఫిఫా ప్రపంచకప్ 2026 కేవలం క్రీడా సంబరాలకే పరిమితం కాలేదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా గణనీయమైన ప్రభావం చూపిందని తాజా నివేదిక వెల్లడించింది. మ్యాచ్‌లను వీక్షించేందుకు లక్షలాది మంది ఉద్యోగులు కార్యాలయాలకు ఆలస్యంగా వెళ్లడం, ముందుగానే వెళ్లిపోవడం, కొందరు పూర్తిగా గైర్హాజరు కావడం వల్ల ఉత్పాదకత భారీగా తగ్గిందని పేర్కొంది.



## రాజంపేట టీడీపీలో ఆధిపత్య హోరు
### పార్టీ కార్యాలయానికి పంచాయితీ

కడప జిల్లా రాజంపేట నియోజకవర్గ టీడీపీలో గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు ఇప్పుడు పార్టీ అధిష్టానం దృష్టికి చేరాయి. నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు వ్యవహార శైలిపై పలువురు సీనియర్ నాయకులు, మండల స్థాయి నేతలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంతో పరిస్థితి తీవ్రతరమైంది. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు తెలుస్తోంది. (వివరాలు 5లో..)

## దోషులకు కఠిన శిక్ష

**మహిళల భద్రతపై రాజీ లేదు**
**గుంటూరు ఘటనపై సీఎం ఆగ్రహం**

గుంటూరులో మహిళపై జరిగిన అమానవీయ దాడిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనను అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మహిళల గౌరవం, భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. సమాజంలో ఏ మహిళకు అవమానం జరిగినా అది ఏమాత్రం సహించబోమని పేర్కొన్నారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. (వివరాలు 7లో..)

## ఇదేనా సుపరిపాలన

**గుంటూరు ఘటనపై జగన్ ఫైర్**
**ప్రభుత్వ వైఫల్యంపై ప్రశ్నల వర్షం**
**ప్రభుత్వాన్ని నిలదీసిన వైసీపీ అధినేత**

గుంటూరులో మహిళను వివస్త్ర చేసి దాడి చేసిన ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన మానవత్వానికే మచ్చ అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పడానికి ఇదే నిదర్శనమని విమర్శించారు. ఈ ఘటనపై చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. మహిళల భద్రతపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. (వివరాలు 7లో..)



## గోదావరిలో విషాదం

- చేపల వేటకు వెళ్లి ఐదుగురు మృతి

పోలవరం జిల్లాలోని గోదావరి నదిలో ఘోర విషాదం చోటుచేసుకుంది. చేపల వేటకు వెళ్లిన ముగ్గురు మహిళలు సహా ఐదుగురు నదిలో మునిగి మృతి చెందారు. ఈ ఘటన శనివారం ఉదయం ఏటపాక మండలం గొల్లగూడెం గ్రామ సమీపంలో జరిగింది. వరద నీటి ప్రవాహంతో చేపలు ఎక్కువగా లభిస్తాయనే ఆశతో స్థానికులు నదిలోకి దిగగా ఈ ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా లోతైన ప్రాంతంలో చిక్కుకోవడంతో ఐదుగురు బయటపడలేకపోయారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. (వివరాలు 5లో..)



## నియోజకవర్గాల విభజనపై పోరు
### కేంద్ర నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం
### ప్రతిఘటిస్తామన్న కేసీ వేణుగోపాల్

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు డీలిమిటేషన్ అంశంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్ అనేది కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి సమస్య మాత్రమే కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన జాతీయ అంశమని స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన సమతుల్యాన్ని ప్రభావితం చేసే ఏ నిర్ణయాన్నైనా కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా రాజ్యాంగ పరిరక్షణ కోణంలో చూడాలని పిలుపునిచ్చారు.
(వివరాలు 5లో..)

## భారత్‌కు అరుదైన ఘనత

**విక్రమ్-1తో కొత్త మైలురాయి**
**అంతరిక్షంలో భారత ప్రైవేట్ శకం**

హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్ 1 రాకెట్ విజయవంతంగా కక్ష్యలోకి చేరి భారత అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించింది. శ్రీహరికోటలోని ఇస్రో తొలి ప్రయోగ వేదిక నుంచి ప్రయోగించిన ఈ రాకెట్ సుమారు 15 నిమిషాల్లోనే 450 కిలోమీటర్ల ఎత్తులో ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఈ విజయంతో స్వంత రాకెట్ ద్వారా కక్ష్యలోకి ఉపగ్రహాలను పంపిన ప్రైవేట్ సంస్థ కలిగిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచింది. ఇప్పటికే అమెరికా, చైనా ఈ జాబితాలో ఉన్నాయి.


### 3డీ సాంకేతికతతో విప్లవం

విక్రమ్ 1 ప్రత్యేకత దాని ఆధునిక సాంకేతికతలో ఉంది. రాకెట్ ఇంజిన్ తయారీలో స్కైరూట్ 3డీ ప్రింటింగ్ టెక్నాలజీని వినియోగించింది. సంప్రదాయ పద్ధతిలో ఉండే అనేక విడిభాగాల స్థానంలో ఒకే భాగంగా ఇంజిన్‌ను రూపొందించింది. దీంతో బరువు తగ్గడంతో పాటు లీకేజీలు, సాంకేతిక లోపాల అవకాశాలు కూడా గణనీయంగా తగ్గాయి. తయారీ సమయం, వ్యయం కూడా భారీగా తగ్గినట్లు సంస్థ వెల్లడించింది.

# విక్రమ్-1 విజయగర్జన

- దేశమంతా హర్షధ్వానాలు
- చంద్రబాబు ప్రశంసలు
- పవన్, లోకేశ్ హర్షం

## స్కైరూట్ బృందానికి ప్రధాని అభినందనలు


వివరాలు3లో..

**భారత తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్1' విజయవంతం కావడంతో దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి 'మిషన్ ఆగమన' పేరుతో ప్రయోగించిన ఈ రాకెట్ అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేసి భారత అంతరిక్ష రంగంలో కొత్త చరిత్ర సృష్టించింది. ఈ విజయంతో ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేట్ సంస్థలు కూడా అత్యాధునిక అంతరిక్ష ప్రయోగాలు నిర్వహించే సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాయి. ఈ ఘనతపై ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు ప్రముఖులు స్కైరూట్ ఏరోస్పేస్ బృందాన్ని అభినందించారు.**

### భారత అంతరిక్ష రంగానికి కొత్త దిశ

'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ మిషన్ భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి పెద్ద ఊతంగా నిలిచింది. ఇస్రోతో కలిసి ప్రైవేట్ సంస్థలు కూడా అంతరిక్ష ప్రయోగాల్లో కీలక పాత్ర పోషించగలవని విక్రమ్ 1 నిరూపించింది. ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలకు మార్గం సుగమం చేయడంతో పాటు ప్రపంచ అంతరిక్ష మార్కెట్‌లో భారత ప్రైవేట్ సంస్థల సామర్థ్యాన్ని మరింత బలంగా చాటింది.



## ఇస్రోలో రాజీనామాల కలకలం
### శాస్త్రవేత్తల రాజీనామాలపై ఆందోళన
### సైంటిస్టుల విషయంలో కేంద్రం కఠినం

దేశ అంతరిక్ష కార్యక్రమాలకు ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. గగన్‌యాన్‌తో పాటు కీలక అంతరిక్ష ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు ఇకపై సాధారణంగా రాజీనామా చేయడం, స్వచ్ఛంద పదవీ విరమణ పొందడం సాధ్యం కాదు. అలాంటి ప్రతి దరఖాస్తును అంతరిక్ష శాఖే పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుంది. ఇటీవల ఇస్రోకు చెందిన అత్యంత కీలక కేంద్రాల నుంచి సుమారు వంద మంది శాస్త్రవేత్తలు వైదొలగడం ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది.

# రాజంపేట టీడీపీలో ఆధిపత్య పోరు



### పార్టీ కార్యాలయానికి పంచాయితీ

కడప జిల్లా రాజంపేట నియోజకవర్గ టీడీపీలో గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు ఇప్పుడు పార్టీ అధిష్టానం దృష్టికి చేరాయి. నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు వ్యవహార శైలిపై పలువురు సీనియర్ నాయకులు, మండల స్థాయి నేతలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంతో పరిస్థితి తీవ్రతరమైంది. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

### ఏకపక్ష ధోరణిపై పార్టీకి ఫిర్యాదులు

ఒంటిమిట్టకు చెందిన నాలుగు దశాబ్దాలకు పైగా పార్టీకి సేవలందిస్తున్న కొమరా వెంకట నరసయ్య తొలి నుంచి ఇన్‌చార్జ్ నిర్ణయాలను ప్రశ్నిస్తున్నారు. సిద్ధవటం మండలానికి చెందిన రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, జగదీష్ రెడ్డి, జోహర్ బాషా తదితరులు కూడా ఇటీవల జరిగిన నియోజకవర్గ సమావేశంలో బహిరంగంగా విమర్శలు చేసి అదే సమావేశాన్ని బహిష్కరించడం విభేదాల తీవ్రతను చాటింది. మండల అధ్యక్షుల నియామకాలలో ఏకపక్ష ధోరణి అవలంబించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

### బాహాటంగా అసమ్మతి కార్యక్రమాలు

రాజంపేట మండలంలోని సీనియర్ నాయకులు కొండా శ్రీనివాసులు, గీతాంజలి రమణ మిరియాల జ్యోతి తదితరులు కూడా తమ అసమ్మతిని దాచిపెట్టకుండా వ్యక్తం చేస్తున్నారు. ఇక 48 వేల ఓటర్లతో కీలకమైన సుండుపల్లి మండలంలో అక్కడి సీనియర్ నేతలు మహేష్ నాయుడు, రమేష్ నాయుడు వర్గం సమాంతర పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. నందలూరులో రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి వర్గం, వీరబల్లిలో నేతి ఆంజనేయులు కూడా ఇన్‌చార్జ్‌కు వ్యతిరేకంగా ఉన్నారని సమాచారం.

### 21న తేలిపోనున్న రాజంపేట పంచాయితీ

ఈ పరిణామాల నేపథ్యంలో ఈ నెల 21న మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పరిశీలకుడు చిట్టిబాబు నాయుడు జోనల్ కో ఆర్డినేటర్ దామంచర్ల సత్య సమక్షంలో ఇరు వర్గాలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ భేటీలో అసమ్మతి నేతల అభ్యంతరాలు, ఇన్‌చార్జ్ వివరణలను విని అధిష్టానం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రాజంపేట టీడీపీకి ఈ సమావేశం కీలక మలుపుగా మారే అవకాశముంది. విభేదాలను పక్కనపెట్టి ఐక్యతకు ప్రాధాన్యం ఇస్తే పార్టీ బలోపేతం అవుతుంది. లేకపోతే అంతర్గత విభేదాలు భవిష్యత్ ఎన్నికలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.



# ఇస్రోలో రాజీనామాల కలకలం

- శాస్త్రవేత్తల రాజీనామాలపై ఆందోళన
- సైంటిస్టుల విషయంలో కేంద్రం కఠినం

దేశ అంతరిక్ష కార్యక్రమాలకు ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. గగన్‌యాన్‌తో పాటు కీలక అంతరిక్ష ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు ఇకపై సాధారణంగా రాజీనామా చేయడం, స్వచ్ఛంద పదవీ విరమణ పొందడం సాధ్యం కాదు. అలాంటి ప్రతి దరఖాస్తును అంతరిక్ష శాఖే పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుంది. ఇటీవల ఇస్రోకు చెందిన అత్యంత కీలక కేంద్రాల నుంచి సుమారు వంద మంది శాస్త్రవేత్తలు వైదొలగడం ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది.

### జాతీయ ప్రాజెక్టుల రక్షణే లక్ష్యం

గగన్‌యాన్, ఉపగ్రహ ప్రయోగాలు, భవిష్యత్ అంతరిక్ష మిషన్లు దేశ ప్రతిష్ఠకు సంబంధించినవని ప్రభుత్వం భావిస్తోంది. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు ఒక్కసారిగా సంస్థను వీడితే ప్రాజెక్టుల అమలు దెబ్బతింటుందని అంతరిక్ష శాఖ పేర్కొంది. కీలక సాంకేతిక పరిజ్ఞానం, అనుభవం కోల్పోవడం వల్ల జాతీయ ప్రాధాన్య కార్యక్రమాలు ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అందుకే నిష్క్రమణపై ప్రత్యేక నియంత్రణలు తీసుకొచ్చారు.

### విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి

కొత్త నిబంధులపై కొన్ని వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఉద్యోగం మార్చుకునే స్వేచ్ఛ ప్రతి ఉద్యోగికి ఉండాలని, కఠిన ఆంక్షలు ప్రతిభావంతులలో అసంతృప్తిని పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు ప్రభుత్వ వర్గాలు మాత్రం దేశ భద్రత, వ్యూహాత్మక ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేస్తున్నాయి. ప్రతిభను నిలబెట్టుకోవడం, జాతీయ అంతరిక్ష కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని పేర్కొంటున్నాయి.

# నియోజకవర్గాల విభజనపై పోరు

- కేంద్ర నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం
- ప్రతిఘటిస్తామన్న కేసీ వేణుగోపాల్



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు డీలిమిటేషన్ అంశంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్ అనేది కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి సమస్య మాత్రమే కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన జాతీయ అంశమని స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన సమతుల్యాన్ని ప్రభావితం చేసే ఏ నిర్ణయాన్నైనా కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా రాజ్యాంగ పరిరక్షణ కోణంలో చూడాలని పిలుపునిచ్చారు.

### సమాఖ్య స్ఫూర్తికి భంగం వద్దు

డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల సమాఖ్య వ్యవస్థ బలహీనపడే పరిస్థితి రాకూడదని వేణుగోపాల్ అన్నారు. రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గేలా, ప్రజాస్వామ్య సమతుల్యం దెబ్బతినేలా ఎలాంటి మార్పులు చేసినా అంగీకరించబోమని స్పష్టం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని పేర్కొన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే నిర్ణయాలు తీసుకోరాదని కేంద్రానికి సూచించారు.

### ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం

డీలిమిటేషన్ బిల్లు అమలు విషయంలో అన్ని రాజకీయ పార్టీలు, రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ కోరుతోంది. ప్రజాస్వామ్య విలువలు, సమాన ప్రాతినిధ్యం, సమాఖ్య స్ఫూర్తి పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని వేణుగోపాల్ తెలిపారు. రాజ్యాంగం నిర్దేశించిన సమతుల్యాన్ని కాపాడుతూ దేశ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. డీలిమిటేషన్‌పై విస్తృత చర్చ జరగాలని, అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ అభిప్రాయపడుతోంది.

## రవాణా నిబంధనల ఉల్లంఘనపై ఉక్కుపాదం

# తనిఖీలు ముమ్మరం

రాష్ట్రవ్యాప్తంగా రవాణా నిబంధనలను మరింత కఠినంగా అమలు చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా స్కూల్ బస్సులు, ఓవర్‌లోడ్ వాహనాలు, పన్నులు చెల్లించని వాహనాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు నిర్వహించి ఉల్లంఘనలను అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.



# ఢిల్లీలో పెరుగుతున్న ఉత్కంఠ

- వాంగ్‌చుక్‌ను ఆస్పత్రికి తరలింపు
- ఐనా దీక్ష ఆపేదేలేదంటున్న సీజేపీ
- 21వ రోజుకు చేరిన నిరాహార దీక్ష

ప్రముఖ పర్యావరణవేత్త సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 21వ రోజుకు చేరడంతో దేశ రాజధాని ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తున్న వాంగ్‌చుక్‌ను ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా పోలీసులు సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చేరిన తర్వాత కూడా ఆయన నిరాహార దీక్షను కొనసాగిస్తున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. జూలై 20న జరగనున్న "చలో పార్లమెంట్" కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చినట్లు తెలిపారు.

### ఆరోగ్యంపై వైద్యుల ఆందోళన

దీర్ఘకాల నిరాహార దీక్ష కారణంగా వాంగ్‌చుక్ తీవ్ర నిర్జలీకరణ లక్షణాలతో బాధపడుతున్నారని వైద్యులు వెల్లడించారు. శరీరంలో ఎలక్ట్రోలైట్ అసమతుల్యత కనిపిస్తోందని పేర్కొన్నారు. వెంటనే ద్రవాలు, వైద్య చికిత్స అవసరమని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి వైద్య బృందంతో పాటు ఎయిమ్స్‌కు చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా అభిప్రాయపడ్డారు. అయితే కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా చికిత్స ప్రారంభించలేదని ఆస్పత్రి అధికారులు తెలిపారు.

### కుటుంబ సభ్యుల అభ్యంతరాలు

ఆస్పత్రి వ్యవహారశైలిపై వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో అభ్యంతరం వ్యక్తం చేశారు. వైద్య నివేదికలను తమకు పూర్తిగా అందించడం లేదని ఆరోపించారు. మరో ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకునే అవకాశం కూడా ఇవ్వడం లేదని చెప్పారు. కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా ఎలాంటి మందులు, ద్రవాలు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. వైద్య చికిత్సలో పారదర్శకత ఉండాలని ఆమె డిమాండ్ చేశారు.

### దేశవ్యాప్తంగా రాజకీయ స్పందన

వాంగ్‌చుక్‌ను జంతర్ మంతర్ నుంచి తరలించిన ఘటనపై పలు రాజకీయ పార్టీల నేతలు స్పందించారు. ప్రభుత్వం చర్చలకు ముందుకు రావాలని అన్నా హజారే సూచించారు. రాహుల్ గాంధీ, పలువురు ప్రతిపక్ష నేతలు శాంతియుత నిరసనను అడ్డుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. మరోవైపు హైకోర్టు ఆదేశాలు, వైద్యుల సూచనల మేరకే ఆస్పత్రికి తరలించినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. జూలై 20న ప్రతిపాదించిన "చలో పార్లమెంట్" కార్యక్రమం నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# లక్షన్నర కోట్లు బొక్క

- అమెరికాకు వరల్డ్ కప్ షాక్
- ప్రపంచకప్ జోష్... పనికి బ్రేక్
- ఫుట్‌బాల్ మోజు... ఆర్థిక ప్రభావం




ఫిఫా ప్రపంచకప్ 2026 కేవలం క్రీడా సంబరాలకే పరిమితం కాలేదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా గణనీయమైన ప్రభావం చూపిందని తాజా నివేదిక వెల్లడించింది. మ్యాచ్‌లను వీక్షించేందుకు లక్షలాది మంది ఉద్యోగులు కార్యాలయాలకు ఆలస్యంగా వెళ్లడం, ముందుగానే వెళ్లిపోవడం, కొందరు పూర్తిగా గైర్హాజరు కావడం వల్ల ఉత్పాదకత భారీగా తగ్గిందని పేర్కొంది. ఈ ప్రభావంతో అమెరికా ఆర్థిక వ్యవస్థకు సుమారు 11.7 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. ప్రపంచవ్యాప్తంగా ఈ నష్టం దాదాపు 17 బిలియన్ డాలర్లకు చేరిందని.. భారతీయ రూపాయల్లో దీని విలువ సుమారు లక్షన్నర కోట్ల ఉంటుందని అంచనా వేస్తున్నారు.

### అమెరికాలో కార్యాలయాలకు భారీ డుమ్మా

మానవ వనరుల సాఫ్ట్‌వేర్ సంస్థ యూకేజీ నివేదిక ప్రకారం ప్రపంచకప్ సమయంలో ఉద్యోగుల హాజరు గణనీయంగా తగ్గింది. ముఖ్యంగా అమెరికా జట్టు ఆడిన మ్యాచ్‌ల రోజుల్లో ప్రభావం ఎక్కువగా కనిపించింది. అమెరికా జట్టు బెల్జియం చేతిలో ఓడిన మరుసటి రోజు కార్యాలయ హాజరు 26 శాతం తగ్గింది. సూపర్‌బౌల్ తర్వాత నమోదైన తగ్గుదల కంటే ఇది దాదాపు పదిరెట్లు ఎక్కువగా ఉండటం విశేషం. మ్యాచ్‌ల ప్రభావం ఉద్యోగుల హాజరుపై ఎంత తీవ్రంగా పడిందో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

### సమావేశాలపై కూడా ప్రభావం

ఉద్యోగుల హాజరు మాత్రమే కాదు, వ్యాపార కార్యకలాపాలపైనా ప్రపంచకప్ ప్రభావం పడింది. ఖాతాదారుల సమావేశాలు, ఉద్యోగ ఇంటర్వ్యూలు, వ్యాపార భాగస్వాముల భేటీలు కూడా 32 శాతం మేర తగ్గినట్లు వర్క్‌ప్లేస్ మేనేజ్‌మెంట్ సంస్థ ఎన్‌వాయ్ వెల్లడించింది. ఈ పరిస్థితిని సంస్థ "నాకౌట్ ట్యూస్‌డే"గా పేర్కొంది. అమెరికా టోర్నీ నుంచి నిష్క్రమించిన తర్వాత మాత్రం కార్యాలయ హాజరు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంది.

### సంస్థల ముందస్తు చర్యలు

ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు కొన్ని ప్రముఖ సంస్థలు ముందస్తు చర్యలు చేపట్టాయి. ఎస్అండ్‌పీ, జేపీ మోర్గాన్ చేజ్, గోల్డ్‌మాన్ శాక్స్ వంటి సంస్థలు మ్యాచ్‌ల రోజుల్లో ఉద్యోగులకు ఇంటి నుంచే పని చేసే అవకాశం కల్పించాయి. ట్రాఫిక్ ఇబ్బందులు, సమయ నష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నాయి. దీంతో ఉద్యోగులు మ్యాచ్‌లను వీక్షిస్తూ పనులు పూర్తి చేసే వెసులుబాటు లభించింది.

### ఫైనల్ తర్వాత సాధారణ పరిస్థితులు

జూలై 19న స్పెయిన్, అర్జెంటీనా మధ్య జరిగే ఫైనల్‌తో ప్రపంచకప్ ముగియనుంది. అమెరికా జట్టు ఫైనల్‌లో లేకపోవడంతో కార్యాలయ హాజరుపై ప్రభావం గతంతో పోలిస్తే తక్కువగానే ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడా టోర్నమెంట్ ఉద్యోగుల పని తీరు, వ్యాపార ఉత్పాదకత, కార్యాలయ నిర్వహణపై ఎంతటి ప్రభావం చూపగలదో ఈ గణాంకాలు మరోసారి స్పష్టం చేశాయి. క్రీడలపై అభిమానుల మక్కువ ఒక్కోసారి దేశాల ఆర్థిక కార్యకలాపాలపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని ఈ అధ్యయనం వెల్లడించింది.

# అనపర్తి టీడీపీ ఇన్‌చార్జిగా నియామకం

- మంత్రి నిమ్మలకు మనోజ్‌రెడ్డి కృతజ్ఞతలు



అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా యువనేత నల్లమిల్లి మనోజ్ రెడ్డి మంత్రి నిమ్మల రామానాయుడిని మట్టపర్రులో మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కృషి చేస్తానని మనోజ్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఎల్‌నినోపై ముందస్తు చర్యలు

- విద్యుత్ కొరతకు తావివ్వొద్దు

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యుత్ పంపిణీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని విస్తరించాలని, పవర్ అంబులెన్స్ సేవలను బలోపేతం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సోలార్ విద్యుత్ అందించడంతో పాటు సబ్‌స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆదేశించారు. భవిష్యత్ ఇంధన అవసరాల కోసం కొత్త బొగ్గు బ్లాక్‌ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.

## ఫాల్కన్ సీఎండీ

# అమర్‌దీప్ అరెస్ట్

- 14 రోజుల రిమాండ్

ఫాల్కన్ గ్రూప్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కీలక చర్యలు చేపట్టింది. ఫాల్కన్ గ్రూప్ సీఎండీ అమర్‌దీప్ కుమార్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని తీహార్ జైలు నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అనంతరం ఆయనను చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. పెట్టుబడిదారులకు అధిక లాభాల పేరుతో రూ.4,215 కోట్లకు పైగా నిధులు సేకరించినట్లు ఈడీ గుర్తించింది. ఈ కేసులో ఇప్పటికే రూ.20.6 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసిన అధికారులు, నిధుల మళ్లింపుపై దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# గోదావరిలో విషాదం

- చేపల వేటకు వెళ్లి ఐదుగురు మృతి



పోలవరం జిల్లాలోని గోదావరి నదిలో ఘోర విషాదం చోటుచేసుకుంది. చేపల వేటకు వెళ్లిన ముగ్గురు మహిళలు సహా ఐదుగురు నదిలో మునిగి మృతి చెందారు. ఈ ఘటన శనివారం ఉదయం ఏటపాక మండలం గొల్లగూడెం గ్రామ సమీపంలో జరిగింది. వరద నీటి ప్రవాహంతో చేపలు ఎక్కువగా లభిస్తాయనే ఆశతో స్థానికులు నదిలోకి దిగగా ఈ ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా లోతైన ప్రాంతంలో చిక్కుకోవడంతో ఐదుగురు బయటపడలేకపోయారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### వరద ప్రవాహమే ప్రమాదానికి కారణం

స్థానికుల వివరాల ప్రకారం లక్ష్మి, భారతి, సుశీల, బాలరాజు, రమేష్ చేతి వలలతో చేపలు పడుతుండగా ప్రమాదానికి గురయ్యారు. భద్రాచలం ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు రావడంతో గోదావరిలో ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. ప్రవాహ తీవ్రతను అంచనా వేయలేకపోయిన వారు నీటిలో కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. వారిని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

### సహాయక చర్యల్లో స్థానికులు

సమాచారం అందుకున్న ఏటపాక పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల పడవల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. గంటలపాటు సాగిన శోధన అనంతరం ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేపట్టారు.

### అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

వరదల సమయంలో నదుల్లో చేపల వేటకు వెళ్లడం అత్యంత ప్రమాదకరమని అధికారులు హెచ్చరిస్తున్నారు. గోదావరిలో నీటి ప్రవాహం వేగంగా మారుతున్నందున స్థానికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ విషాద ఘటనతో గొల్లగూడెం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఒకేసారి ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం స్థానికులను కన్నీటి పర్యంతం చేసింది. అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అవసరం లేకుండా నదిలోకి దిగవద్దని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# రావణ్‌కు మరోసారి షాక్

- రిమాండ్ గడువు పొడిగించిన కోర్టు



యూట్యూబర్ 'ప్రశ్న' రావణ్‌కు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన రిమాండ్ గడువును గన్నవరం కోర్టు మరోసారి పొడిగించింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హిందూ మతంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసుతో పాటు యూఏపీఏ కింద నమోదైన కేసులో ప్రస్తుతం రావణ్ రిమాండ్‌లో ఉన్నారు. రిమాండ్ గడువు ముగియడంతో పోలీసులు ఆయనను వర్చువల్‌గా గన్నవరం కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్ పొడిగించాలని పోలీసులు కోరగా, బెయిల్ మంజూరు చేయాలని రావణ్ తరఫు న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న కోర్టు బెయిల్ ఇవ్వకుండా రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో రావణ్ మరికొంతకాలం జైలులోనే ఉండాల్సి వచ్చింది. మావోయిస్టు భావజాలాన్ని ప్రోత్సహించేలా, సాయుధ తిరుగుబాటును రెచ్చగొట్టేలా, విద్వేషాలను వ్యాప్తి చేసేలా వీడియోలు రూపొందించారనే ఆరోపణలతో కృష్ణా జిల్లా గన్నవరం పోలీసులు ఆయనపై యూఏపీఏ కింద కేసు నమోదు చేశారు. మరోవైపు తనపై నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ రావణ్ దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. దానిపై తీర్పు కోసం ఆయన న్యాయవాదులు ఎదురుచూస్తున్నారు.

# తప్పు చేస్తే చర్యలు తప్పవు

- కార్యకర్తలకు చంద్రబాబు హెచ్చరిక

తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గుడివాడలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకరి తప్పు మొత్తం పార్టీపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. తప్పిదాల వల్లే వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిందని విమర్శించారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే పార్టీ విజయాలు శాశ్వతమవుతాయని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. పార్టీ కార్యకర్తల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు.

### శిశువు కిడ్నాప్ ముఠా గుట్టురట్టు.. ఐదుగురు అరెస్ట్

హైదరాబాద్‌లో శిశువుల అక్రమ రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు ఛేదించారు. చందానగర్‌లో తల్లి ఒడిలో నుంచి నెల రోజుల పసికందును కిడ్నాప్ చేసి రూ.1.50 లక్షలకు విక్రయించేందుకు ప్రయత్నించిన ఐదుగురిని అరెస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్‌కు తరలించే కుట్రను పోలీసులు భగ్నం చేశారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో ప్రత్యేక బృందాలు వేగంగా దర్యాప్తు చేసి శిశువును సురక్షితంగా రక్షించి కన్నతల్లికి అప్పగించాయి. ఈ ముఠాకు ఇతర రాష్ట్రాలతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## హిట్ అండ్ రన్ కేసులో

# పోలీసులపై వేటు

- సీఐ, ఎస్ఐ వీఆర్‌కు

శ్రీకాకుళం జిల్లాలో సంచలనం సృష్టించిన హిట్ అండ్ రన్ కేసులో ఇద్దరు పోలీసు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన కేసులో విధుల్లో అలసత్వం ప్రదర్శించడంతో పాటు నిందితులకు సహకరించారనే ఆరోపణలపై కాశీబుగ్గ సీఐ రామకృష్ణను వీఆర్‌కు పంపించారు. ఇప్పటికే ఎస్ఐ సునీల్‌పై కూడా ఇదే చర్యలు తీసుకున్నారు. ప్రమాదానికి సంబంధించిన సాక్ష్యాలను తారుమారు చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేసుపై విచారణ కొనసాగుతోంది.

# గోల్ఫ్ టూరిజంపై ఏపీ ఫోకస్

- కపిల్ దేవ్‌తో మంత్రి దుర్గేష్ భేటీ

ఆంధ్రప్రదేశ్‌లో గోల్ఫ్ టూరిజాన్ని అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేయడంపై పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, భారత మాజీ క్రికెటర్ కపిల్ దేవ్‌తో నోయిడాలో సమావేశమయ్యారు. విశాఖపట్నం, అమరావతి ప్రాంతాల్లో గోల్ఫ్ పర్యాటకానికి ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం ఆంధ్రప్రదేశ్‌కు రావాలని మంత్రి దుర్గేష్ కపిల్ దేవ్‌ను అధికారికంగా ఆహ్వానించారు. మరోవైపు పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఏపీ అత్యంత సురక్షిత రాష్ట్రంగా మారిందని మంత్రి పేర్కొన్నారు. సింగిల్ విండో విధానంతో అనుమతులు వేగంగా మంజూరు చేస్తున్నామని వెల్లడించారు.



## అద్దం తిరిగిన అమెరికా కథ..
## అంధకారంలో భారత విద్యార్థుల వ్యధ

కురుక్షేత్రంలో ద్రోణాచార్యుడు పద్మవ్యూహం పన్నాడు. లోపలికి ఎలా వెళ్ళాలో అభిమన్యుడికి తెలుసు, బయటికి ఎలా రావాలో తెలియదు. తల్లి గర్భంలో సగం విద్య విన్నవాడు, సగం మిగిల్చుకున్నవాడు. లోపలికెళ్ళే ధైర్యం ఉంది, బయటికొచ్చే దారి తెలియదు విషాదం, అదే అతని వీరత్వం. ఇప్పుడు ఈ కాలానికి ఒక కొత్త పద్మవ్యూహం ఉంది. దాని పేరు అమెరికా. 2005కి ముందు వెళ్ళినవారిది వేరే కథ. డాలర్ నలభై రూపాయల చుట్టూ తిరిగే రోజులవి. H1B వస్తే నాలుగైదేళ్ళలో గ్రీన్ కార్డ్ చేతికొచ్చేది. వెళ్ళడం సాహసం కాదు, ఒక ప్రయాణం మాత్రమే. వెళ్ళినవాళ్ళు తిరిగి రావొచ్చు, వ్యూహంలోకి వెళ్ళినా తలుపు తెరిచే ఉండేది. ఆ తరం అర్జునులు. యుద్ధం చేసినా, వ్యూహాన్ని ఛేదించి బయటికి వచ్చే విద్య వాళ్ళకి తెలుసు. కష్టపడ్డారు, సంపాదించారు. కానీ ఆ కష్టానికి ఒక ముగింపు ఉండేది, ఒక సాఫల్యం ఉండేది. గత పదిహేను సంవత్సరాలలో వెళ్ళినవారిది వేరే కథ. H1B లాటరీలో గెలవడమే ఒక యుద్ధం. గెలిచాక గ్రీన్ కార్డ్ క్యూ - భారతీయులకు దశాబ్దాల పొడవు. డెబ్బై, ఎనభై ఏళ్ళు పడుతుందని లెక్కలు వచ్చాయి. అంటే ఏంటి దాని అర్థం? ఒక మనిషి తన జీవితకాలం మొత్తం అదే జ్యాసలో బతకాలి. ఇల్లు కొన్నా, పిల్లలు అక్కడే పుట్టినా, వాళ్ళు శాశ్వతంగా ఒక అతిథి. ఇదే ఇప్పటి పద్మవ్యూహం. లోపలికి ప్రవేశం సులభమే వీసా స్టాంపింగ్, విమానం ఎక్కడం. బయటికి వచ్చే దారి? అదొక్కటే తెలియదు. తెలిసినా ఆ దారి ఇరుకైనది, పొడవైనది.

# పద్మవ్యూహంలో.. అభిమన్యుడు

## అగ్రరాజ్యంలో అంతులేని కష్టాలు..
## చక్రబంధంలో చిక్కుకున్న జీవచ్ఛవాలు

కృష్ణుడికి తెలుసు, ఈ తరం తల్లిదండ్రులకూ తెలుసు మహాభారతంలో ఒక సూక్ష్మమైన సత్యం ఉంది. అభిమన్యుడు వ్యూహంలోకి వెళ్తే ఏమవుతుందో కృష్ణుడికి తెలుసు. అయినా అపలేదు, అది ధర్మయుద్ధం, అది కర్తవ్యం. తెలిసి కూడా ఆ దుఃఖాన్ని మౌనంగా భరించాడు. ఇవాళ ఈ తరం తల్లిదండ్రుల పరిస్థితి కూడా అంతే. కొడుకో కూతురో అమెరికా వెళ్తున్నప్పుడు, పైకి నవ్వుతూ సాగనంపినా లోపల తెలుసు ఇది ప్రయాణం కాదు, ఏకాంతవాసం. తెలిసినా ఆపరు, అదే బిడ్డ కోరుకున్న భవిష్యత్. కానీ ప్రతి రాత్రి ఫోన్ మోగగానే గుండె ఆగినట్టు అనిపిస్తుంది "ఎందుకు ఇంత రాత్రిప్పుడు కాల్ చేసింది, ఏమైనా జరిగిందా" అని. కంటికి కనబడని దూరం నుంచి ఊహించుకుంటూ బతకాల్సిందే. రేపు ఏదైనా జరిగితే ఎవరు చూసుకుంటారు, ఎవరు దగ్గరుండి కాపాడతారు ఈ ప్రశ్నలు నిద్రలో కూడా వెంటాడతాయి. వీసా రాకపోతే, వయసు రీత్యా ప్రయాణం చేయలేకపోతే తల్లిదండ్రులు తమ పిల్లల్ని చివరిసారి చూసేందుకు కూడా అక్కడికి చేరుకోలేని పరిస్థితి, దగ్గరుండి కాపాడుకోలేని పరిస్థితి. అదే భయం రెండో వైపు నుంచి కూడా వెంటాడుతుంది. "రేపు మా ఆఖరి రోజులలో మా బిడ్డ మమ్మల్ని చూడటానికి రాగలరా, మాతో ఉండగలరా, మమ్మల్ని సరిగ్గా కడతేర్చగలడా" అని.

A for అమ్మో
Me for మేము
RI for రిటర్న్ రాడం
CA for కష్టం

**• అప్పుడు లాభం, ఇప్పుడు అప్ప**

వాట్సాప్ ఇన్‌స్టాగ్రామ్ స్టేటస్‌లు చూస్తే సక్సెస్ కథలా కనిపిస్తుంది. కానీ లోపల ఇమిగ్రేషన్‌లా మారితే, ఆర్థిక మాంద్యం వస్తే సంవత్సరాల కష్టం ఒక్క రాత్రిలో తలకిందులవ్వొచ్చు. ఇది సంపాదన కాదు, నిరంతరం కొనసాగుతున్న యుద్ధం. ప్రతిరోజూ యుద్ధం చేస్తూనే ఉండాలి. గెలుపు ఎప్పటికీ పూర్తిగా చేతికి రాదు. అర్జునుడి యుద్ధానికి ముగింపు ఉంది. కురుక్షేత్రం అయిపోయాక రాజ్యం వచ్చింది. అభిమన్యుడి యుద్ధానికి ముగింపు లేదు. అతను వ్యూహం లోపలే ఉండిపోయాడు, చనిపోయాడు. ఇప్పుడు అమెరికాలో మనవాళ్ళ పరిస్థితి అభిమన్యుడు లాంటిదే. ఇండియాలో అప్పటి లెక్క చూడండి. డాలర్ నలభై, యాభై చుట్టూ ఉన్నప్పుడు వెళ్ళినవాళ్ళు, ఉద్యోగం వచ్చేసరికి డాలర్ అరవైకి చేరేది. ఆ నష్టం కూడా వాళ్ళకి లాభంగా మారింది అప్పట్లో భూముల రేట్లు తక్కువ. డాలర్లు ఇండియాకు పంపి పెట్టుబడి పెట్టారు. కొన్నేళ్ళలో ఆ పెట్టుబడి రెట్టింపు, మూడింతలు అయ్యింది. డాలర్ సంపాదన, ఇండియా పెట్టుబడి - ఈ రెండూ కలిసి ఒక తరాన్ని ఆర్థికంగా నిలబెట్టాయి. అదృష్టవంతులు ఎవరు అంటే 1990-2000లో అమెరికా వచ్చిన వాళ్ళు. ప్రస్తుతం టాలీవుడ్లో అగ్ర నిర్మాతలు కూడా అప్పుడు వెళ్ళినవాళ్ళే. ఇప్పుడు లెక్క పూర్తిగా తారుమారైంది. డాలర్ తొంభైకి చేరింది, చదువు పూర్తయ్యేసరికి వందకు చేరుతోంది. చదువు కోసం తీసుకున్న ఎడ్యుకేషన్ లోన్ మీద వడ్డీ పెరుగుతూనే ఉంటుంది. డిగ్రీ ఒక్కటే సర్టిఫికేట్ కాదు, EMI కూడా ఒక సర్టిఫికేట్, జీవితాంతం ఉంటుంది. ఉద్యోగం దొరికినా, ఆ అప్పు తీర్చడానికే కనీసం రెండు మూడేళ్ళు ఒంటరిగా, ఖర్చులు కుదించుకుని బతకాల్సిందే. పైగా ఇప్పుడు ఇండియాలో భూముల రేట్లు, అపార్ట్మెంట్ రేట్లు ఎంత ఎత్తుకి వెళ్ళిపోయాయంటే ఇండియాలో ఇల్లు కొనడం కన్నా అమెరికాలోనే కొనడం చౌక అనిపించే పరిస్థితి. అప్పటి తరానికి రెండు వైపులా లాభమే ఉండేది. ఈ తరానికి రెండు వైపులా అప్పే ఉంది.

**• కొత్త బట్టలు, పాత దూరం.. ఇండియా ట్రిప్**

గత ఎనిమిదేళ్ళలో ఇండియాలో అవకాశాలు ఊహించనంతగా పెరిగాయి. సోషల్ మీడియా వల్ల తమ టాలెంట్ మీద తామే నిలబడగలిగే దారులు తెరుచుకున్నాయి. చదువుతో సంబంధం లేకుండా. చిన్నప్పటి నుంచి నేర్చుకున్న స్కేటింగ్, ఆర్ట్ వర్క్ నే ఈరోజు జీవనోపాధిగా మార్చుకుని, తల్లిదండ్రులతో సంతోషంగా ఇక్కడే ఉంటున్నవాళ్ళు ఉన్నారు. డిగ్రీ చదువుతూనే డిజిటల్ మీడియా మార్కెటింగ్ చేసుకుంటున్నారు, ఫోటోగ్రఫీ, ఈవెంట్ మేనేజ్మెంట్, షార్ట్ ఫిల్మ్స్, ఆన్లైన్ సేల్స్ టాలెంట్ ఉన్నవాళ్ళు ఇక్కడే ఉండిపోతున్నారు. IT రంగంలో స్టార్టింగ్ ప్యాకేజీ కనీసం పది లక్షలు. ఇక్కడ నువ్వు ఏమైనా చేసుకోవచ్చు. అమెరికాలో H1B జాబ్ అంటే జాబే ఇంకో ఆదాయం ఇల్లీగల్. కాలం మారింది. టాలెంట్ పెరిగింది, ఉపాధి పెరిగింది. ఖర్చులు పెరిగాయి. అమెరికా మాత్రం అక్కడే ఆగిపోయింది. ఇప్పుడు వీసా రూల్స్ ఉన్న అవకాశాలను కూడా చంపేస్తున్నాయి. ఇండియా వెళ్తున్నావా అంటే చాలు, ఎవరూ "క్షేమంగా వెళ్ళిరా" అనరు. "షాపింగ్ అయిపోయిందా" అనే అడుగుతారు. ఇండియా ట్రిప్ అంటే మనకి పాస్పోర్ట్ కన్నా ముందు కావాల్సింది షాపింగ్ లిస్టు. ఇది ఆచారం, ఇంచుమించు ట్రాడిషన్ లాంటిది. అమ్మానాన్నలకి ఏం తీసుకెళ్లాం, తోడబుట్టినవాళ్ళకి ఏం పట్టికెళ్లాం అని మొదలుపెట్టిన ఆలోచన, చివరికి "నాకేం కావాలి" దగ్గర ఆగిపోతుంది. వాళ్ళ కోసం మొదలైన లిస్టు, మన కోసం ముగుస్తుంది. ఇదొక్కటే మనం కచ్చితంగా సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ చేసే ప్రాజెక్టు. కొత్త బట్టలు, కొత్త షూస్, కొత్త హ్యాండ్ బ్యాగ్‌తో ఇండియాలో దిగుతాం. దేనికోసం? "వాళ్ళు అమెరికాలో బాగా సెటిల్ అయ్యారు" అని అనిపించాలి, అంతే. బట్టలు కొత్తవే, కానీ ఉద్దేశం పాతదే చూపించుకోవడం.


**• వచ్చేటప్పుడు గొప్ప, ఉన్నప్పుడు ఖాళీ**

ఇండియాలో మన జీవితంలో ఎన్నో కొత్త ఆలోచనలు, కలుస్తాం, పంచుకుంటాం. కానీ అమెరికాలో ఉన్న హెచ్ 1బీ వాళ్ళ ఏమీ చేయలేని పరిస్థితి. అయినా ఇండియాలో అమెరికా ఎన్నారై అంటే పెళ్ళికి పన్నీరు జల్లి స్వాగతం పలికినట్టు, అమెరికాలో దిగగానే, పోర్ట్ ఆఫ్ ఎంట్రీ దగ్గరే డాలర్లు వర్షంలా కురుస్తాయని అనుకునేవాళ్ళు లేకపోలేదు "మా దేశానికి వచ్చినందుకు ఖర్చుపెట్టుకోండి" అని ఎవరో పర్సు తెరుస్తారని. కానీ అక్కడ జల్లేది పన్నీరు కాదు, పేపర్వర్క్ స్వాగతం బదులు స్టాంపింగ్. ఎవరైనా "ఇక ఇండియా రావా" అంటే "ఇండియాలో ఇంత జీతం రాదు, ఇలాంటి లగ్జరీ లైఫ్ స్టైల్ ఉండదు" అని సర్దిచెప్పుకునేవాళ్ళు ఒకప్పుడు, జవాబు రెడీగా ఉండేది, గొంతులో వణుకు ఉండేది కాదు. కానీ గత ఐదేళ్ళుగా ఇండియాలో మారిన లైఫ్ స్టైల్‌ని చూసి, ఆ జవాబు ఇప్పుడు నసుగుతూ వస్తుంది. "అమెరికాలో ఉన్న సేవింగ్స్‌తో ఇండియా వెళ్ళి బతకగలమా" అనే ఆలోచన లోపల మొదలైంది.

**• పదేళ్ళలో ఎవరు ముందుకెళ్ళారు**

హైదరాబాద్‌లో వీకెండ్‌కి కొత్త కొత్త రిసార్ట్లు, రెస్టారెంట్లు, పబ్లు పుట్టుకొస్తున్నాయి. మన హైదరాబాద్‌లో ఉన్న లగ్జరీ పబ్లు, రెస్టారెంట్లు న్యూయార్క్ సిటీ, లాస్ ఏంజెలిస్, శాన్ఫ్రాన్సిస్కో, చికాగో, వెగాస్ లాంటి అమెరికా మహా నగరాల్లో కూడా లేవు అంటే నమ్మశక్యంగా లేదు, కానీ నిజం. ఎందుకంటే అమెరికా అభివృద్ధి 2010లో ఎంత ఉందో ఇప్పుడు కూడా అంతే ఉంది. ఇండియా మాత్రం ఆకాశమే హద్దుగా ముందుకెళ్తాంది. ఇండియాలో 25-45 ఏళ్ళ మధ్య ఉన్నవాళ్ళు ఏడాదికి స్పా సర్వీసెస్ కోసం లక్షలు ఖర్చు పెడుతుంటే, అమెరికాలో ఫేస్ వాష్‌తో సరిపెట్టుకుంటున్నారు. ఈ 20 ఏళ్ళలో హెయిర్ కట్ ఖర్చు వంద రూపాయల నుంచి రెండు వేలకి చేరితే, అక్కడేమో ఇంకా సూపర్ కట్స్, గ్రేట్ క్లిప్స్ కూపన్ల కోసం వెదుకుతున్నారు. అక్కడ హెయిర్‌కట్ చేసేది ఎక్కువగా అమ్మాయిలే. అమెరికా వచ్చిన కొత్తలో అబ్బాయైనా, అమ్మాయైనా దాదాపు అందరూ ఒకసారి ఈ అనుభవం ఆచార్యం పొందాల్సిందే. మనం "ఇలా కావాలి" అని చెప్తాం, వాళ్ళు "ఒకే" అంటారు. కానీ చివరికి వాళ్ళ ఇష్టం వచ్చినట్టు కట్ చేసేస్తారు, ఇది హెయిర్‌కట్ కాదు. ఒక సర్‌ప్రైజ్ పార్టీ, తేడా ఏంటంటే మనం సర్‌ప్రైజ్ అయ్యేది అద్దంలో. మన మొహాన్ని పది రోజులు అద్దంలో చూసుకోవాలంటేనే భయం వేసేలా చేస్తారు. వాళ్ళ హెయిర్‌కట్ స్టైల్ చూసిన తర్వాతే మన వాళ్ళు వాళ్ళకి వాళ్ళే హెయిర్‌కట్ ఎలా చేసుకోవాలో నేర్చుకున్నారు.. ఇదొక్కటే అమెరికాలో మనం సాధించిన సెల్ఫ్ రిలయన్స్. మంచి సర్వీస్లు ఉంటాయి, కానీ $40$50 హెయిర్‌కట్‌కి పెట్టాలంటే "వామ్మో" అనుకుంటే అదే అమెరికా బతుకు. ఇండియాలో ఏడాదికి రెండు ట్రిప్‌లతో చుట్టుపక్కల దేశాలన్నీ కవర్ చేస్తుంటే, మనకి తెలిసిన ఏకైక ట్రిప్ ఇండియా ఒక్కటే. వచ్చాం, తిరుపతి వెళ్ళాం, తిన్నాం, జబ్బు పడ్డాం. ఇదే అందరి ట్రిప్‌లో ఉండేది. వీసా ప్రాబ్లం వల్ల అమెరికా వదిలి వెళ్ళాలంటే భయం. అమెరికాలో జీవితం ఆఫర్లు ఇవ్వకపోతే ఏది కొనం ఎక్కడైనా అవసరమైనవి కొంటారు. ఇక్కడేమో ఆఫర్లు ఉన్నవి కొనేస్తాం. ఇండియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తుడు గ్రాసరీ షాపింగ్ కోసం, జనరల్ స్టోర్‌కి వెళ్ళే పని లేదు. స్విగ్గీ, జొమాటో లాంటి సర్వీసులు ఇంటికే తెచ్చేస్తాయి. అమెరికాలో మనవాళ్ళు వీకెండ్ వస్తే గొప్పగా చెప్పుకునేది. "కాస్ట్‌కో, సామ్స్, బీజేలకి వెళ్ళొచ్చాం" అని. 2005లో రాత్రి తొమ్మిది తర్వాత తినాలంటే ఉన్న ఆప్షన్స్ మెక్డొనాల్డ్స్, డామినోస్, పిజా హట్. ఇప్పటికీ చాలా స్టేట్స్‌లో అవే ఆప్షన్స్.. డలాస్, చికాగో లాంటి కొన్ని నగరాలు మినహాయిస్తే. అందుకే చాలామంది డలాస్ వైపు మొగ్గు చూపుతారు. అక్కడైనా వాతావరణం కొంచెం ఇండియాలా ఉంటుందని.

**• ఓడలు రేవులు అవుతాయి, రేవులు ఓడలు**



"ఓడలు రేవులు అవుతాయి, రేవులు ఓడలవుతాయి" అనే సామెతకు ఇప్పుడు కళ్ళెదుటే కనిపిస్తున్న ఉదాహరణ ఒకటి ఉంది. అమెరికా నుంచి ఎవరైనా ఇండియాకి వస్తున్నారంటే "ఒక ఐఫోన్ తీసుకురా, ఒక మ్యాక్‌బుక్ తీసుకురా" అనేది ఒకప్పటి మాట. ఇప్పుడు డాలర్ నూరుకి చేరువలో ఉండటంతో.. ఆ లెక్క తారుమారైంది ఇటీవల ఒక ప్రీమియం సౌండ్ బ్రాండ్ (సోనస్ అల్ట్రా ఆర్క్ $900 72,000 రూపాయలు), అమెరికాలో ధర. అదే ప్రైమ్‌డే రోజు ఇండియాలో ధర చూసి అమెరికాలో ఉన్న మనవాళ్ళే ఖంగు తిన్నారు. ఇప్పుడు పరిస్థితి ఇండియా నుంచి అమెరికాకు ఎలక్ట్రానిక్స్ తీసుకెళ్ళే రోజు వచ్చింది. ఇది సామెత కాదు, ఇది ఇప్పటి లెక్క. ఇక్కడ, ఇండియాలో, మనవాళ్ళ మధ్య, మన నేల మీద బతుకుతున్నాం ఇది ప్రశాంత జీవితం. అక్కడ, అమెరికాలో, డిప్రెషన్, యాంగ్జైటీ, హోమ్ సిక్‌నెస్ ఇవి నిత్యం తోడు. కొందరు "తెలివైనవాళ్ళు" అంటారు "ఇండియాలో పొల్యూషన్ ఎక్కువ, పాలిటిక్స్ ఎక్కువ.. అమెరికాలో హాయిగా బతకొచ్చు" అని. అలా అనుకునేముందు ఒక్కసారి లెక్కలు చూడాలి. కార్బన్ ఉద్గారాల్లో, భూమిని అత్యధికంగా వేడెక్కించిన చరిత్రలో అమెరికా ముందు వరుసలో దీనివల్ల నష్టం ఏంటంటే, ఆ వేడెక్కడం ఆ దేశపు గాలిలో, నీళ్ళలో, తిండిలో కలిసిపోయింది. బ్రెస్ట్ క్యాన్సర్ కేసుల సంఖ్యలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. మానసిక ఒత్తిడికి, డిప్రెషన్‌కి మందులు వాడే జనాభాలో ఎప్పుడూ అగ్రస్థానంలోనే ఉంది. అభివృద్ధి చేసిన చేతులే, ఆ అభివృద్ధి వల్ల వచ్చిన రోగాలని కూడా మోస్తున్నాయి. నిజమే, గాలి నాణ్యతలో ఇండియాదే ఎక్కువ కష్టం, అది కాదనడం లేదు. కానీ "అమెరికా అంటే ఆరోగ్యకరమైన, సుఖమైన బతుకు" అనే భ్రమని కూడా ప్రశ్నించుకోవాలి. సుఖం అంటే ఏంటో కథలు నిర్ణయించవు, లెక్కలు నిర్ణయిస్తాయి. మనం చెప్పుకునే కథలు వేరు, గణాంకాలు చెప్పే నిజం వేరు.

**"ఎలాగో చనిపోయారు" అనే కొత్త మాట**

ఇక్కడ ఒక అపోహను సరిదిద్దుకోవాలి. ఇది కేవలం డబ్బు ఉన్నవాళ్ళ కథ కాదు. అమెరికా అంటే ఒక "స్టేటస్". 2010 ప్రాంతంలో వెళ్ళినవాళ్ళలో చాలామంది సొంత అక్కా చెల్లి పెళ్ళికి కూడా రాలేకపోయారు. ఒక గ్రూప్ డిస్కషన్‌లో ఎవరో అన్నారు "వీసా ప్రాబ్లం వల్ల మా వాళ్ళు రాలేదు" అని. పక్కనున్న వాళ్ళు తలూపారు, "అవును, మా వాళ్ళు కూడా అంతే" అని. ఇండియాలో తల్లిదండ్రులు కూడా అదే మాట సమాజానికి చెప్పి ప్రాణం బిగబట్టుకునేవారు. సమాజం కూడా అర్థం చేసుకున్నట్టు నటించేది, ఎందుకంటే అప్పట్లో వెళ్ళినవాళ్ళు తక్కువ. గత నాలుగేళ్ళుగా వచ్చింది. ఇప్పుడు అక్కా చెల్లి పెళ్ళి సంగతి పక్కన పడితే, తల్లిదండ్రులు చనిపోయినా రాలేని పరిస్థితి. వీసా ప్రాబ్లం వల్ల ఇండియా రాలేకపోతున్నారు. తండ్రినో తల్లినో కడసారి చూడలేకపోతున్నారు. దహన సంస్కారాలకు హాజరు కాలేకపోతున్నారు. ఇది ఎంత మామూలైపోయిందంటే "ఎలాగో పోయారు, రిస్క్ చేసి వెళ్తే తిరిగి రారు" అని మాట్లాడుకునే స్థాయికి వచ్చేసాం. ఇంత పెద్ద దుఃఖాన్ని ఒక వాక్యంలో సర్దుకునేంత ప్రాక్టీస్ చేసేసుకున్నాం. ఏ యుద్ధంలోనైనా సైనికుడు ఏడవడం మానేస్తే, అది వీరత్వం కాదు, అది మొద్దుబారిపోవడం.

**• యాభైకి వచ్చే వరం**

2010లో మాస్టర్స్ కోసం వెళ్ళినవారికి తన గ్రీన్ కార్డ్ ఎప్పుడు వస్తుందో ఇప్పటికీ తెలియదు. అమెరికాలో పుట్టిన పిల్లలు పెద్దయ్యాక తమ తల్లిదండ్రుల్ని స్పాన్సర్ చేస్తే ఆ దారి వేగంగా ఉంటుంది. కానీ ఉద్యోగం మీద వెళ్ళి క్యూలో నిలబడ్డవారికి ఆ వేగం లేదు. 2010లో వెళ్ళినవారికి గ్రీన్ కార్డ్ చేతికొచ్చేసరికి యాభై దాటిపోతాయి. క్యూలో నిలబడ్డప్పుడు యంగ్ ఉన్నా, టోకెన్ నెంబర్ వచ్చేసరికి రిటైర్మెంట్ ఏజ్. వయసులో ఉన్నప్పుడు ఏదైనా చేయగలం, రిస్క్ తీసుకోగలం. యాభై దాటాక రిస్క్ తీసుకునే శక్తి మన చేతుల్లో ఉండదు. అప్పుడు వచ్చిన దాని వల్ల ఉపయోగం ఏంటి? ప్రయాణం సులభం అవుతుందేమో అనుకుంటే, ఆ వయసుకి దేశాలు దాటే ప్రయాణమే గణనీయంగా తగ్గిపోతుంది. ఏం సాధించామో కాదు, ఎప్పుడు సాధించామో అనేదే అసలు ప్రశ్న సమయానికి రాని విజయం, విజయమేనా?

**కర్మ చక్రం..**
**అయితే ఇది నిరాశ కథ కాదు**

మహాభారతంలో ఒక ధర్మం ఉంది కూడా. అదే జరుగుతుంది, ఆ ప్రతిఫలం మరో తరానికి బదిలీ అవుతుంది. ఈరోజు అమెరికాలో బిడ్డల కోసం అమ్మానాన్నలను వదిలి వచ్చినవారు, రేపు తన పిల్లలకు అదే అనుభవాన్ని ఇస్తారు. పిల్లలకు పదిహేను వచ్చేసరికి రెక్కలొస్తాయి, చదువు కోసం, కెరీర్ కోసం ఎగిరిపోతారు. అప్పుడు ఈ తల్లిదండ్రులు తమ సొంత ఇంట్లోనే అతిథులు అవుతారు. "నాతో ఉండండి అని అడిగే పరిస్థితి లేదు. ఎందుకంటే పిల్లలు ఒక్క మాట అంటే చాలు, "మీరు మీ పేరెంట్స్ వేసిన ప్రతి అడుగుకూ ఒక ప్రతిఫలం ఉంటుంది. ఇక్కడ అధికారం కూడా ఉండదు. వదిలేసి వచ్చేశారు, మేము వెళ్ళకూడదా" అని అంటే, మొహం ఎక్కడ పెట్టుకోవాలో తెలియదు. చివరికి ఏం మిగులుతుంది? ఒంటరిగా అమెరికాలో జీవితం గడిపి, ఒంటరిగానే ఆఖరి శ్వాస వదలడం. ఇండియాలో ఉన్న తోబుట్టువులు రాలేరు. వాళ్ళకి తెలిసేది ఒక్కటే వార్త "చనిపోయాడంట". అంతే. ఆ మనిషి ఎలా బతికాడో, ఎంత ఒంటరిగా బతికాడో ఎవ్వరికీ తెలియదు. అదొక్క వాక్యంలో ఒక జీవితం మొత్తం ముగిసిపోతుంది. అభిమన్యుడు యుద్ధభూమిలో పోరాడుతూ చనిపోయాడు, అతని కథ చరిత్రలో నిలిచిపోయింది. ఈ కాలపు అభిమన్యులు నిశ్శబ్దంగా పోరాడి, నిశ్శబ్దంగానే వెళ్ళిపోతున్నారు. వాళ్ళ కథ ఒక వాట్సాప్ మెసేజ్లో ఫార్వార్డ్ అవుతుంది. ఇది ఒక వాస్తవాన్ని గుర్తు చేయడం మాత్రమే వ్యవస్థ మారింది. దానికి తగ్గట్టు మన అంచనాలు, మన సంభాషణలు కూడా మారాలి. నిజాన్ని దాచిపెట్టి "అమెరికా వెళ్ళడం అంటే విజయం" అనే పాత కథనాన్నే పల్లె వేయడం సరికాదు. 2005కి ముందు వెళ్ళినవారి కథ వేరు, ఇప్పుడు వెళ్తున్నవారి కథ వేరు. ఈ తేడాను అర్థం చేసుకోవడమే ఇంటి దగ్గర ఎదురుచూసే తల్లిదండ్రులకూ, పద్మవ్యూహంలో ఉన్న ఈ తరం అభిమన్యులకూ ఇద్దరికీ న్యాయం చేసినట్టు. అభిమన్యుడు వ్యూహంలో ఒంటరిగా పోరాడాడు. మన కథలో, వ్యూహం బయట ఉన్న తల్లితండ్రులు కూడా పిల్లల కోసం అదే యుద్ధాన్ని దూరం నుంచి, మౌనంగా పోరాడుతున్నారు.

**ఇది ఒక్కరి కథ కాదు**
**- ఇది ఒక తరం కథ.**

**- జి. ఫణి కిషోర్**
**(పీకే)**
**యూఎస్ఏ**



**పార్టు - 2 వచ్చే వారం**
**అమెరికా కలల వెనుక నిజాలు**
**డాలర్లు కాదు జీవితం ముఖ్యం**

# జాతీయ అవార్డుల్లో సినీ సంబరం

- 72వ జాతీయ అవార్డుల ప్రకటన
- మమ్ముట్టికి నాలుగోసారి అవార్డు

72వ జాతీయ చలనచిత్ర అవార్డులను కేంద్ర జ్యూరీ ప్రకటించింది. 2024లో సెన్సార్ ధ్రువీకరణ పొందిన చిత్రాలకు ఈ అవార్డులు ప్రకటించారు. భారతీయ సినీ రంగంలో ప్రతిభ కనబరిచిన నటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు, వివిధ భాషల చిత్రాలను ఈ అవార్డులతో సత్కరించారు. ఫీచర్ ఫిల్మ్స్, నాన్ ఫీచర్ ఫిల్మ్స్, సినీ రచన విభాగాల్లో విజేతలను ప్రకటించారు.



## మమ్ముట్టికి నాలుగో జాతీయ అవార్డు

మలయాళ స్టార్ మమ్ముట్టి తన అద్భుత నటనతో మరోసారి జాతీయ అవార్డును అందుకున్నారు. 'భ్రమయుగం' చిత్రానికి ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఇది ఆయన కెరీర్‌లో నాలుగో జాతీయ అవార్డు కావడం విశేషం. హిందీ చిత్రం 'చందు ఛాంపియన్'లో నటించిన కార్తిక్ ఆర్యన్ కూడా ఉత్తమ నటుడి అవార్డును పంచుకున్నారు. కార్తిక్‌కు ఇది తొలి జాతీయ అవార్డు.

## ఉత్తమ నటి యామి గౌతమ్

'ఆర్టికల్ 370' చిత్రంలో నటించిన యామి గౌతమ్ ఉత్తమ కథానాయికగా ఎంపికయ్యారు. ఇదే చిత్రం ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డును కూడా దక్కించుకుంది. రాజకీయ నేపథ్యంతో రూపొందిన ఈ సినిమా కథనం, నటనకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ చిత్రానికి శశ్వత్ సచ్‌దేవ్ ఉత్తమ సంగీత దర్శకుడి అవార్డును కూడా అందుకున్నారు.

## తెలుగు సినిమాకు 'కల్కి' గౌరవం

నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా రూపొందిన 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును గెలుచుకుంది. వినోదంతో పాటు విలువలను అందించిన చిత్రంగా ఈ సినిమాను జ్యూరీ ఎంపిక చేసింది. మరోవైపు 'పుష్ప 2' చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే విభాగంలో దర్శకుడు సుకుమార్ అవార్డు అందుకున్నారు. ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ విభాగంలో దీపాలి నూర్, షీతల్ శర్మ విజేతలుగా నిలిచారు.

## 'అమరన్'కు భారీ గుర్తింపు

మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితకథ ఆధారంగా రూపొందిన 'అమరన్' చిత్రానికి దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి ఉత్తమ దర్శకుడి అవార్డును అందుకున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడిగా ఎంపికయ్యారు. తమిళ చిత్రం 'రాయన్' ఉత్తమ తమిళ చిత్రంగా నిలిచింది. 'మహారాజా' చిత్రానికి ఉత్తమ యాక్షన్ కొరియోగ్రఫీ అవార్డు లభించింది.

## ఇతర ముఖ్య విజేతలు

ధనుష్ నటించిన 'కెప్టెన్ మిల్లర్' చిత్రానికి ప్రత్యేక ప్రస్తావన లభించింది. 'మేయళగన్' చిత్రానికి సౌండ్ మిక్సింగ్ విభాగంలో ప్రత్యేక గుర్తింపు దక్కింది. కన్నడలో 'మిథ్య', మలయాళంలో 'ఫెమినిచి ఫాతిమా' ఉత్తమ ప్రాంతీయ చిత్రాలుగా ఎంపికయ్యాయి. తొలి దర్శకుడిగా రణదీప్ హుడా తెరకెక్కించిన 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్' చిత్రం జాతీయ అవార్డును గెలుచుకుంది. ఈ ఏడాది జాతీయ చలనచిత్ర అవార్డులు భారతీయ సినీ రంగంలోని విభిన్న భాషల ప్రతిభకు మరోసారి గొప్ప గుర్తింపుగా నిలిచాయి.

### 4 సినిమాలకు 8 అవార్డులు

**అవార్డుల్లో తెలుగు చిత్రాల జోరు**

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు సినీ పరిశ్రమ సత్తా చాటింది. 2024 సంవత్సరానికి ప్రకటించిన అవార్డుల్లో పలు తెలుగు చిత్రాలు వివిధ విభాగాల్లో ప్రతిష్ఠాత్మక పురస్కారాలను దక్కించుకున్నాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు' ఎంపిక కాగా, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు సాధించింది. నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం, ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ విభాగాల్లో రెండు జాతీయ అవార్డులు గెలుచుకుంది. 'లక్కీ భాస్కర్' చిత్రానికి దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా ఎంపికయ్యారు. 'పుష్ప2' చిత్రానికి దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా అవార్డు అందుకోగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్లుగా దీపాలి నూర్, సీతల్ శర్మలు ఎంపికయ్యారు. '35చిన్న కథ కాదు' ఉత్తమ బాలల చిత్రంగా నిలవగా, ఆ చిత్రంలో నటించిన అరుణ్‌దేవ్ పోతుల ఉత్తమ బాల నటుడి అవార్డును కైవసం చేసుకున్నారు. తెలుగు చిత్రాల విజయంతో సినీ పరిశ్రమ ఆనందంలో మునిగిపోయింది.



### వెంకీ అట్లూరికి నేషనల్ అవార్డ్

**'లక్కీ భాస్కర్'కు జాతీయ గౌరవం**

దర్శకుడు వెంకీ అట్లూరి మరో అరుదైన ఘనత సాధించారు. ఆయన తెరకెక్కించిన 'లక్కీ భాస్కర్' చిత్రానికి 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ స్క్రీన్‌ప్లే విభాగంలో జాతీయ అవార్డు లభించింది. సినిమాలో కథను ఆసక్తికరంగా నడిపించడం, భావోద్వేగాలను చక్కగా ఆవిష్కరించడం, ప్రేక్షకులను ఆకట్టుకునే స్క్రీన్‌ప్లేతో వెంకీ అట్లూరి ప్రశంసలు అందుకున్నారు. ఈ అవార్డుతో ఆయన రచనా ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు పొందిన 'లక్కీ భాస్కర్' మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది.

# గుంటూరులో దారుణం

- మహిళను వివస్త్ర చేసి దాడి
- నీళ్ల గొడవ.. అమానవీయ ఘటన
- సభ్య సమాజాన్ని కలచివేసిన ఘటన

గుంటూరు నగరంలో మహిళపై జరిగిన అమానవీయ దాడి తీవ్ర సంచలనం రేపింది. నీటి పైప్‌లైన్ వివాదం చివరకు దారుణ ఘటనకు దారితీసింది. నగరంలోని నగరంపాలెం పరిధిలోని కృష్ణబాబు కాలనీలో 46 ఏళ్ల మహిళను ఇంటి నుంచి ఈడ్చుకొచ్చి నడిరోడ్డుపై వివస్త్ర చేసి దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలకు కారణమైంది. మహిళ గౌరవాన్ని కించపరిచేలా జరిగిన ఈ దాడిని స్థానికులు తీవ్రంగా ఖండిస్తున్నారు.

## నీళ్ల పంచాయితీతో మొదలైన వివాదం

మున్సిపల్ డ్రైనేజీ విస్తరణ పనుల సమయంలో బోర్‌వెల్ మోటార్ దెబ్బతినడంతో దానిని తిరిగి ఏర్పాటు చేసే విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగింది. మోటార్ తొలగించాలంటూ టీడీపీ 21వ డివిజన్ కార్యదర్శి మల్లెల వెంకటరమణమూర్తి అభ్యంతరం వ్యక్తం చేయగా మహిళ వ్యతిరేకించింది. మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. అనంతరం మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా వెంటనే చర్యలు జరగలేదని సమాచారం. అదే రాత్రి నిందితులు ఆమె ఇంట్లోకి చొరబడి బయటకు



లాగి దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## వివస్త్ర చేసి దాడి... స్థానికుల ఆగ్రహం

నిందితులు మహిళ దుస్తులు చించి నడిరోడ్డుపై అవమానిస్తూ దాడి చేశారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆమె కుటుంబ సభ్యులపై కూడా దాడి జరిగినట్లు సమాచారం. బాధితురాలు వేడుకున్నా కనికరం చూపలేదని స్థానికులు చెబుతున్నారు. చివరకు అక్కడికి చేరుకున్న మహిళలు ఆమెకు దుస్తులు అందించి రక్షించారు. ఈ ఘటనతో కాలనీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మహిళల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## కేసు నమోదు... అరెస్టులు...

బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మల్లెల వెంకటరమణమూర్తితో పాటు మరో పలువురిపై చర్యలు చేపట్టారు. పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

# ఇదేనా సుపరిపాలన?

- గుంటూరు ఘటనపై జగన్ ఫైర్
- ప్రభుత్వ వైఫల్యంపై ప్రశ్నల వర్షం
- ప్రభుత్వాన్ని నిలదీసిన వైసీపీ అధినేత

గుంటూరులో మహిళను వివస్త్ర చేసి దాడి చేసిన ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన మానవత్వానికే మచ్చ అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పడానికి ఇదే నిదర్శనమని విమర్శించారు. ఈ ఘటనపై చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. మహిళల భద్రతపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

## ఫిర్యాదు చేసినా స్పందించలేదా?

బుధవారం ఘటన జరిగినప్పటికీ మూడు రోజుల పాటు దానిని కప్పిపుచ్చే ప్రయత్నం జరిగిందని జగన్ ఆరోపించారు. వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం హడావుడిగా చర్యలు తీసుకుంటున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. బాధిత మహిళ మొదటిసారి పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి ఉంటే ఇంత పెద్ద దారుణం జరిగేది కాదని అన్నారు. కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే మహిళపై రెండోసారి దాడి జరిగేదా అని ప్రశ్నించారు.

## పోలీసుల తీరుపై ప్రశ్నల వర్షం

బాధితురాలికి రక్షణ కల్పించకుండా పోలీసులు ఎందుకు మౌనం వహించారని జగన్ ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్లు బాధితుల ఫిర్యాదులు స్వీకరించడానికా లేక అధికార పార్టీ నాయకుల మాట వినడానికా అంటూ నిలదీశారు. నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, వీడియోలు బయటకు వచ్చిన తర్వాత చర్యల పేరుతో హడావుడి చేయడం



ఎలాంటి పోలీసింగ్ అని ప్రశ్నించారు. బాధితురాలి ఫిర్యాదుకు విలువ లేకపోవడం రాష్ట్రంలో చట్టవ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

## 'రెడ్‌బుక్ పాలన'పై విమర్శలు

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన పేరుతో ప్రతిపక్షాలపై దాడులు ప్రోత్సహించారని జగన్ ఆరోపించారు. పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ నాయకులు ఏం చేసినా తమకు రక్షణ ఉంటుందనే భావన పెరిగిందని అన్నారు. అదే ధైర్యంతో మహిళలపై కూడా దారుణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా మార్చిందని వ్యాఖ్యానించారు.

## మహిళల భద్రతపై సూటి ప్రశ్నలు

ఇదేనా మహిళా భద్రత అని చంద్రబాబు ప్రభుత్వాన్ని జగన్ నిలదీశారు. మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అధికార పార్టీ నాయకుల దురాగతాల నుంచి మహిళలు తమను తాము కాపాడుకోవాల్సిన పరిస్థితి రావడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. మహిళల ఆగ్రహమే ఈ ప్రభుత్వానికి సరైన సమాధానం చెబుతుందని జగన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ప్రచారం కంటే ప్రజల భద్రతపై దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# దోషులకు కఠిన శిక్ష

- మహిళల భద్రతపై రాజీ లేదు
- గుంటూరు ఘటనపై సీఎం ఫైర్

గుంటూరులో మహిళపై జరిగిన అమానవీయ దాడిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనను అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మహిళల గౌరవం, భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. సమాజంలో ఏ మహిళకు అవమానం జరిగినా అది ఏమాత్రం సహించబోమని పేర్కొన్నారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## చట్టం ముందు అందరూ సమానమే

నిందితుడు ఏ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి అయినా ఉపేక్షించే ప్రసక్తే లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇప్పటికే కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. ఘటనలో ప్రమేయం ఉన్న పార్టీ కార్యకర్తను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. రాజకీయ అండదండలు, పలుకుబడి, పదవులు ఎవరినీ చట్టం నుంచి రక్షించలేవని హెచ్చరించారు. భయం, పక్షపాతం లేకుండా చట్టాన్ని అమలు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

## లోకేశ్ ఆగ్రహం.. జీరో టాలరెన్స్ హెచ్చరిక

ఘటనపై విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దారుణం తనను



తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిందితులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ప్రధాన నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఘటనలో ప్రమేయం ఉన్న పార్టీ నాయకుడిని అన్ని పార్టీ పదవుల నుంచి సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

## మహిళల గౌరవమే ప్రభుత్వ ప్రాధాన్యం

మహిళలను అవమానించే ఘటనలను తమ ప్రభుత్వం ఏమాత్రం సహించదని లోకేశ్ స్పష్టం చేశారు. మహిళలపై నేరాలకు జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. తప్పు చేసిన వ్యక్తి ఎవరైనా చట్టం ముందు సమానమేనని మరోసారి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి మహిళ భద్రత, గౌరవాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని చంద్రబాబు, లోకేశ్ ఇద్దరూ పేర్కొన్నారు. గుంటూరు ఘటనలో పూర్తి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేయడంతో నిందితులపై మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

# స్టార్ హీరోలకు హితవు

- ఏపీ మీద ప్రేమ లేదా?
- రాష్ట్రంలో షూటింగ్స్ చేయాలి
- అంబికా కృష్ణ సంచలన వ్యాఖ్యలు

ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ బలోపేతం కావాలంటే అగ్రహీరోలు తమ చిత్రాల షూటింగ్‌లను రాష్ట్రంలో నిర్వహించాలని సినీ నిర్మాత, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ పిలుపునిచ్చారు. ప్రతి స్టార్ హీరో తన సినిమా కోసం కనీసం రెండు షెడ్యూళ్లైనా ఆంధ్రప్రదేశ్‌లో ప్లాన్ చేస్తే రాష్ట్రంలో సినీ రంగానికి కొత్త ఊపు వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఏలూరులో మాట్లాడిన అంబికా కృష్ణ, రాష్ట్రంలో చిత్రీకరణలు పెరిగితే వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సినీ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన లైట్ బాయ్స్, జూనియర్ ఆర్టిస్టులు, సాంకేతిక నిపుణులు, రవాణా రంగం, హోటళ్లు, క్యాటరింగ్ సేవలు సహా అనేక వర్గాలకు పని దొరుకుతుందని వివరించారు. షూటింగ్‌లు పెరగడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందని చెప్పారు. ఈ దిశగా నటుడు నందమూరి బాలకృష్ణ ఇప్పటికే మంచి ప్రారంభం చేశారని అంబికా కృష్ణ పేర్కొన్నారు. అదే తరహాలో మిగిలిన అగ్రహీరోలు కూడా తమ సినిమాల చిత్రీకరణకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.



రాష్ట్రంలో సముద్ర తీరాలు, కొండలు, అడవులు, నదీ తీరాలు వంటి అద్భుతమైన సహజ చిత్రీకరణ ప్రాంతాలు ఉన్నాయని, వాటిని సినీ పరిశ్రమ మరింతగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నంది అవార్డుల నిర్వహణను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరిగి ప్రారంభించాలని కూడా అంబికా కృష్ణ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత సినిమాల్లో ఆంధ్ర ప్రాంత భాష, యాస క్రమంగా కనుమరుగవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక భాష, సంస్కృతి, యాసలకు దర్శకులు, రచయితలు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కువగా షూటింగ్‌లు జరిగితే ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, భాషకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# రాశి ఫలితాలు

**(19.07.2026– 25. 07. 2026 వరకు)**

**మేషరాశి :** తండ్రి ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి. సంతాన అభివృద్ధికై చేసే ఖర్చులు పెరుగుతున్నాయి. స్పైసీ ఫుడ్ తక్కువగా తీసుకోవడం మంచిది. పరుష పదజాలాన్ని వాడటం తగ్గించకోగలిగితే అందరూ మనవాళ్లే అవుతారు. వాహన చోదకులు తత్ సంబంధ కాగితాలు సరిచూసుకోగలరు. డ్రైవింగ్ స్పీడ్ తగ్గించడం మంచిది. క్రీడాకారులకు అనుకూలం. ప్రేమికుల మనోవాంఛ నెరవేరును. వైద్య విద్యార్థులకు అనుకూలం. ఉద్యోగస్తులకు దైవ శక్తి వలన పదోన్నతికి ఆస్కారం ఉన్నది. విదేశ విద్య అభ్యసించాలనుకునే వారికి వీసా వస్తుంది. విదేశ నివాసితులకు గ్రీన్ కార్డు వచ్చే ఆస్కారం ఉంది. స్వగృహ యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఖరీదైన వస్తువులు బహుమతి గానైనా రావచ్చు. అన్ని రంగాల్లో వారికి వారాంతం నుండి యోగిస్తుంది. రియల్ ఎస్టేట్ రంగులో వారు ఓర్పు, నేర్పుతో ఉన్నచో లాభం అర్జిస్తారు. 21,24వ తేదీలు ప్రతికూలం. 23వ తేదీ అనుకూలం. కోర్టు కేసులు మొదలగు సమస్యల పరిష్కారం కై వారాహి అమ్మవారిని ఆరాధించడం చెప్పదగు సూచన. ప్రతినిత్యము నవగ్రహ ప్రదక్షిణ మేలు చేస్తుంది.

**వృషభ రాశి :** పట్టుదలతో పనులు పూర్తి చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. కుటుంబంతో సంతోషంగా గడుపుతారు. దైవ దర్శనం కు ఆస్కారం ఉంది. సౌమ్యంగా లౌక్యంగా మాట్లాడటం చెప్పదగు సూచన. అన్ని రంగాల వారికి ఆర్థిక అసమానతలు కొనసాగుతాయి. అత్యాశకు పోతే చేటు తప్పదు సుమా! ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ఓర్పుతో, సహనంగా మెలగాలి. నిరుద్యోగులకు నిరాశాజనకమే కావచ్చు. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి కొనసాగుతుంది. కుటుంబ సౌఖ్యాన్ని పొందలేని పరిస్థితిని గమనించే ఉంటారు. మౌనంగా ఉంటే గొడవలు రావు అని గ్రహించాలి. దంపతులు సఖ్యత పెంచుకోవాలి. సంతాన సంబంధ ఆందోళన మిమ్మల్ని వేధిస్తుంది. వాహన మరమ్మతుకు ఆస్కారం ఉంది. 19వ తారీకు అనుకూలం. 20వ తారీకు ప్రతికూలం. ప్రతినిత్యము సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కవచం పారాయణ చేయగలరు. సూర్య నమస్కారాలు చేయాలి. కందిపప్పు దానం మేలు చేస్తుంది.

**మిథున రాశి :** వ్యాపారస్తులకు పెట్టుబడి భారం పెరుగుతుంది. ఉన్నత విద్య కై ప్రయత్నించే విద్యార్థులకు మనోవాంఛ నెరవేరును. ఉద్యోగస్తులకి పదోన్నతి. అవివాహితులకు వివాహ యోగ్యత కాలం వచ్చింది. మీ సంతాన అభివృద్ధికై చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. తీర్థ యాత్ర కు అనుకూలం. తీవ్రంగా ఆలోచన చేస్తే నిద్రలేమి తప్పదు. అన్ని రంగాల వారికి ఆర్థిక సర్దుబాట్లు ఉంటాయి.20,23,25 వ తేదీలు అనుకూలం. విష్ణు సహస్రనామావళి, లక్ష్మీ అష్టోత్తర పారాయణ గ్రహదోష తీవ్రత తగ్గించును.

**కర్కాటక రాశి :** స్వగృహ యోగ్యత కు ఆస్కారం ఉంది. విదే శ విద్య అభ్యసించాలనుకునే వారికి వీసా వస్తుంది. నూతన వాహన కొనుగోలుకై ఇంట్లో చర్చ వస్తుంది. బంధుమిత్రుల వలన మేలు జరిగే ఆస్కారం ఉంది. సాఫ్ట్వేర్ ఉద్యోగ మార్పుకు ఆస్కారం ఉంది. ఆర్థిక అసమానతుల బాధ తప్పదు. వ్యాపారస్తులకు రాను బాకీలు వస్తాయి. వ్యాపార విస్తరణకు పనులు ముందుకు సాగుతాయి. ఖర్చులు నియంత్రించుకోగలరు. ప్రజా జీవనం చేసే వారికి పదవీ బాధ్యత ఆస్కారం ఉంది. కళాకారులకు మంచి అవకాశాలు గుర్తింపు ఉంటుంది. నూతన ప్రణాళికలు అమలు చేస్తారు. నిరుద్యోగులకు మంచి ఉద్యోగం వస్తుంది. ప్రేమ ను పెద్దలు అంగీకరిస్తారు. 20 వ తారీకు అనుకూలం. మంగళ శుక్ర వారాల్లో దుర్గాదేవి అష్టోత్తర శతనామావళి పారాయణ చెప్పదగు సూచన.

**సింహరాశి:** ఉద్యోగస్తులకు పని భారం పెరిగి అధికారుల వేధింపులు ని గమనిస్తారు. విద్యార్థులు విద్య పట్ల ఏకాగ్రతను పెంచుకోవాలి. వ్యాపారస్తులకు పోటీ తత్వం వలన వ్యాపారం తగ్గటం ,రాని బాకీల బెడద ఉండును. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. విదేశ ప్రయాణం చేయాలనుకునే వారికి వీసా రిజెక్ట్ అవుతుంది. ఖర్చులు పెరిగిపోవటం వలన అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండును. గృహిణులు ఓర్పును పెంచుకొని కుటుంబ సభ్యులతో మరింత సఖ్యతగా మెలగాలి. ప్రజా జీవనం చేసే వారికి పదవీ బాధ్యత రావటం కష్టంగానే ఉంది. దంపతుల మధ్య ప్రేమానురాగాలు పెరిగేందుకై సౌందర్య లహరి పారాయణ చెప్పదగు సూచన. అన్ని రంగాల్లోని వారు ప్రతి నిత్యము రావి చెట్టు ప్రదక్షణ చేసిన గ్రహదోష తీవ్రత తగ్గును.

**కన్యారాశి :** విదేశ విద్యను ఆకాంక్షించే వారికి వీసా వస్తుంది. స్వగృహ యోగ ప్రాప్తికి ఆస్కారం ఉంది. అవివాహితులకు వివాహ యోగ్యత కాలం వచ్చింది. తనకా పెట్టిన బంగారం ను విడిపించుకుని అలంకరించుకుంటారు. మాతృ ప్రేమను పొందుతూ కుటుంబంలో సంతోషంగా గడుపుతారు. వ్యాపారస్తులకు రాని బాకీలు వస్తాయి. ఖరీదైన వస్తువులు కొనుగోలు చేస్తారు. గృహిణుల మనోవాంఛ నెరవేరును. విదేశాలలో నివసించే వారికి శాశ్వత నివాస హక్కు పత్రం వచ్చే ఆస్కారం ఉంది. అప్పులు తీరేందుకు ఆస్కారం ఉంది. నిరుద్యోగులకు మంచి ఉద్యోగం వస్తుంది. సాఫ్ట్వేర్ ఉద్యోగ మార్పుకు ఆస్కారం ఉంది. నూతన వాహన యోగం కు ఆస్కారం ఉంది. 19,20,25 తేదీలు అనుకూలం.శనీశ్వర వజ్ర పంజర కవచ పారాయణ మేలు చేస్తుంది. పెరుగన్నం దానం చేయండి.

**తులారాశి :** సంతాన అభివృద్ధికై మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబంలో ఉండే సమస్యలను ఓర్పు, నేర్పుతో పరిష్కరించుకోగలుగుతారు. వ్యాపారస్తులు ఆత్మస్థైర్యం పెంచుకొని కొన్ని మార్పులు చేసుకుంటూ ముందుకు అడుగు వేయటం తోనే పనులు సానుకూలమగును. ఆరోగ్య నియమాలు పాటించటం వలన ఆరోగ్యం చేకూరును. ఇప్పటికైనా బయటి తిళ్ళు ఆపేయటం మంచిది. ఉద్యోగస్తులుకు అధికారుల మన్ననలు ఉండును. ఆకస్మిక ప్రయాణాలకు ఆస్కారం ఉంది. గో మాత సేవ చేస్తూ, మంగళ శుక్రవారము దుర్గాదేవిని ఆరాధించడం వలన మేలు జరుగుతుంది.


**వృశ్చిక రాశి :** రిప్రెజెంట్ ఉద్యోగం చేసేవారు ఓర్పుగా ఉంటే భవిష్యత్తులో యోగిస్తుంది. ఆర్థిక సమానతలు ఉంటూనే ఉంటాయి. భార్యాభర్త సఖ్యత పెంచుకుంటూ సౌందర్యలహరి పారాయణ చేసిన మేలు జరుగును. అవివాహితులు రుక్మిణి కళ్యాణం పారాయణ చేసిన మేలు జరుగును. సహోదర, సహోదరి లతో వివాదాలకు పోవద్దు సుమా! సంతానపరమైన చికాకులు మనస్పర్థలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోగలరు. విదేశ విద్య ఆకాంక్షించే విద్యార్థులకు అనుకూలం. విదేశాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలి అనుకునే వారికి ఇప్పుడు చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. పుణ్య కార్యాలకు ధనం సద్వినియోగం చేస్తారు. ఉద్యోగస్తులు ఓర్పుగా ఉండగలరు. తండ్రి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. ప్రతి నిత్యము నవగ్రహ స్తోత్రం పారాయణ చేయగలరు.19,20,25 తేదీలు అనుకూలం.

**ధనస్సు రాశి :** స్వగృహ యోగ్యతకు ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. సమాజంలో పేరు ప్రఖ్యాతలు పెరుగుతాయి. విహారయాత్రకు ఆస్కారం ఉంది. కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చినా అంత ఆనందాన్ని ఇవ్వదు. విదేశ విద్య ఆకాక్షించే వారికి నిదానంగా పనులు అవుతాయి. నూతన సెల్ ఫోన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడ వచ్చు. ఉద్యోగస్తులు పనిలో నైపుణ్యం చూపించినా గుర్తింపు లేని పరిస్థితిని గమనిస్తారు. 24 వ తారీకు ముఖ్యమైన పనులు వాయిదా వేసుకోవటం మంచిది. క్రమశిక్షణ తో పనిచేస్తే విజయం మీదే. జ్వరము జలుబు వంటి అనారోగ్యాలు పట్ల జాగ్రత్తలు తీసుకోగలరు. చికాకును తగ్గించుకోగలరు. ప్రతినిత్యము కాల భైరవాష్టకాన్ని పారాయణ చేస్తూ సాయంకాలం శివాలయంలో కనీసం 21 ప్రదక్షణ చేయగలరు.


**మకర రాశి :** పట్టుదలతో కార్యసాధకుడిగా ఉండాలి. స్వగృహ యోగానికి ఆస్కారం ఉంది. ఖర్చులు నియంత్రించుకోగలరు. విద్యార్థులు ఎంచుకున్న బ్రాంచీలలో సీటు వచ్చే ఆస్కారం ఉంది. విదేశ విద్యకు అనుకూలము. ఉద్యోగస్తులకు శ్రమ అధికంగా ఉన్న ఫలితం తృప్తినిస్తుంది. ప్రజా జీవనం చేసే వారికి గుర్తింపు లభిస్తుంది. గృహిణులు ఓర్పు పెంచుకోవాలి. వ్యాపారస్తులకు లాభాలు బాగానే ఉంటాయి. కళాకారులకి సామాన్యంగా ఉండును. గోమాత సేవ, జిల్లేడు మొక్కలు నాటి సంరక్షించగలరు. సూర్య నమస్కారము మేలు చేస్తాయి.

**కుంభరాశి :** డ్రైవింగ్ స్పీడ్ తగ్గించగలరు. క్రమశిక్షణ కలిగిన జీవనం చేసే వారికి ఎంతటి కష్టాన్ని అయిన అధికమిస్తారు. విద్యార్థులు ప్రతినిత్యము తల్లి ఆశీస్సులు తీసుకోగలరు. లౌక్యంగా మాట్లాడటం వలన పనులు త్వరిత గతిన అవుతాయి. అన్ని రంగాల్లో ఉండే వారికి ఆర్థిక సమర్థులు ఉంటాయి. ఉద్యోగస్తులు తమ సహచర ఉద్యోగస్తులతో సఖ్యత పెంచుకోగలరు. వ్యక్తిగత ఖర్చులు తగ్గించుకోవటం మంచిది. రియల్ ఎస్టేట్ రంగం వారు ఓర్పువహిస్తే ఆర్థిక లబ్ధి చేకూరును.19,20 తేదీలలో ముఖ్యమైన పనులు వాయిదా వేసుకోవటం మంచిది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం చేయించగలరు. రావి చెట్టు ప్రదక్షిణ వలన మనోవాంఛ నెరవేరును.

**మీన రాశి :** సంతానం కోరుకునే వారికి సంతాన ప్రాప్తికి ఆస్కారం. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటారు. రుణాలు చేసి గృహము కొనుగోలు చేసే ఆస్కారం ఉంది. కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత పెరుగుతుంది. ఆర్థికంగా పరిస్థితులు మెరుగుపడతాయి. రక్తసంబంధీకులతో వివాదాలకు పోవద్దు. పట్టుదలతో పని అయ్యే వరకు ప్రయత్నిస్తే విజయం మీదే. 22వ తారీకు ముఖ్యమైన పనులను వాయిదా వేసుకోగలరు. రావిచెట్టు ప్రదక్షణ మేలు చేస్తుంది. శివాలయంలో సాయంకాలం కనీసం 21 ప్రదక్షణ గ్రహ దోష తీవ్రతను తగ్గించగలదు.



టీటీడీ అనుబంధ సంస్థ సమరసత సిద్ధాంతి
'దైవజ్ఞ' పులిపాక చంద్రశేఖర శర్మ
శ్రీ చక్ర పంచాంగ కర్త 9440783005





# చరిత్ర సృష్టించే పోరు

- నేడే ప్రపంచకప్ ఫైనల్ మహాసంగ్రామం
- తెలుసుకోవాల్సిన 10 ఆసక్తికర విషయాలు

ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్ కోసం ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. యూరప్ ఛాంపియన్ స్పెయిన్, డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా టైటిల్ కోసం తలపడుతున్నాయి. స్పెయిన్ రెండో ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకోగా, వరుసగా రెండు ప్రపంచకప్‌లు గెలిచిన మూడో దేశంగా నిలవాలని అర్జెంటీనా కలలు కంటోంది. ఈ పోరు కోట్లాది మంది అభిమానుల దృష్టిని ఆకర్షించింది.

### మెస్సీ-యమాల్ అరుదైన అనుబంధం

ఈ ఫైనల్‌లో అత్యంత ఆసక్తికర అంశం లియోనెల్ మెస్సీ, లామిన్ యమాల్ ముఖాముఖి పోరు. 2007లో యునిసెఫ్ ఫోటోషూట్ సందర్భంగా ఐదు నెలల చిన్నారి యమాల్‌కు మెస్సీ స్నానం చేయిస్తున్న ఫోటో ఇప్పుడు మరోసారి వైరల్‌గా మారింది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత అదే ఇద్దరు ప్రపంచకప్ ఫైనల్‌లో ప్రత్యర్థులుగా బరిలోకి దిగడం ఫుట్‌బాల్ చరిత్రలో అరుదైన ఘట్టంగా నిలిచింది.

### ట్రంప్ హాజరు.. మిలే గైర్హాజరు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫైనల్‌కు హాజరై విజేత జట్టుకు ట్రోఫీ అందించనున్నారు. మరోవైపు అర్జెంటీనా అధ్యక్షుడు జావియర్ మిలే మాత్రం మూఢనమ్మకంతో స్టేడియానికి రావడం లేదు. ఇప్పటివరకు ప్రతి మ్యాచ్‌ను తన నివాసంలోనే చూసిన ఆయన అదే విధానాన్ని ఫైనల్‌లో కూడా కొనసాగించనున్నారు.

### రికార్డు టికెట్లు.. వినోదాల సందడి

ఈ ఫైనల్ అమెరికా క్రీడా చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఈవెంట్‌గా నిలిచింది. అత్యంత ఖరీదైన టికెట్ ధర సుమారు రూ.27 లక్షలకు చేరుకుంది. మరో ప్రత్యేకత ఏమిటంటే ప్రపంచకప్ చరిత్రలో తొలిసారి సూపర్‌బౌల్ తరహాలో హాఫ్‌టైమ్ షో నిర్వహిస్తున్నారు. మడోన్నా, షకీరా, జస్టిన్ బీబర్, కోల్డ్‌ప్లే వంటి అంతర్జాతీయ తారలు ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

### భారీ బహుమతులు.. ప్రతిష్ఠాత్మక అవార్డులు

ఈ ప్రపంచకప్ మొత్తం ప్రైజ్ మనీ 727 మిలియన్ డాలర్లకు పెరిగింది. విజేత జట్టుకు 50 మిలియన్ డాలర్లు, రన్నరప్‌కు 33 మిలియన్ డాలర్లు అందనున్నాయి. గోల్డెన్ బూట్, గోల్డెన్ బాల్, గోల్డెన్ గ్లోవ్, బెస్ట్ యంగ్ ప్లేయర్, ఫెయిర్ ప్లే అవార్డులు కూడా ప్రదానం చేయనున్నారు. గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ ముందంజలో ఉండటం మరో విశేషం. ఈ మహా ఫైనల్ ఫుట్‌బాల్ అభిమానులకు చిరస్మరణీయ అనుభూతిని అందించనుంది.

# అందరి చూపు అటువైపే!

- ఫైనల్‌కు ముందు పిచ్ టెన్షన్
- స్పెయిన్-అర్జెంటీనాకు కొత్త పరీక్ష

ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్‌కు ముందు అభిమానుల దృష్టి ఆటగాళ్లపై మాత్రమే కాదు.. మ్యాచ్ జరగనున్న పిచ్‌పైనా నిలిచింది. అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రం ఈస్ట్ రదర్‌ఫోర్డ్‌లో ఉన్న మెట్‌లైఫ్ స్టేడియంలో స్పెయిన్, అర్జెంటీనా తుది పోరుకు సిద్ధమవుతున్నాయి. ఈ స్టేడియంలో ఇప్పటి వరకు రెండు జట్లు ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం ఆసక్తిని పెంచుతోంది. ప్రపంచకప్‌లో ఇదే వేదికపై జరిగిన గత మ్యాచ్‌ల తర్వాత పిచ్ నాణ్యతపై పలువురు స్టార్ ఆటగాళ్లు, కోచ్‌లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీంతో ఫైనల్‌లో పిచ్ ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. ఫైనల్‌కు ముందు పిచ్‌ను అత్యుత్తమ స్థితిలో ఉంచేందుకు ఫిఫా ప్రత్యేక చర్యలు చేపట్టింది. కరోలినా గ్రీన్ సోడ్ ఫామ్ నుంచి తీసుకొచ్చిన సహజ గడ్డిని మే నెలలో అమర్చారు. గడ్డిలో ప్రత్యేక హైబ్రిడ్ ఫైబర్లు కలిపి బలాన్ని పెంచారు. తేమ, గడ్డి దృఢత్వం, బంతి కదలిక, ఆటకు అనుకూలత వంటి అంశాలను నిరంతరం పరీక్షించారు. గాలి చేరేలా చేసే ప్రక్రియలు, గడ్డి కత్తిరింపు, నీటి నిర్వహణను శాస్త్రీయంగా అమలు చేశారు. ఫైనల్‌కు ముందు దాదాపు 13 రోజుల విరామం ఇవ్వడం కూడా పిచ్ పూర్తిగా కోలుకునేలా చేసిన వ్యూహమే.

# ఫైనల్ టికెట్ రూ.27 లక్షలు

### ప్రపంచకప్‌లో కొత్త రికార్డు

ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్ టికెట్లు అమెరికా క్రీడా చరిత్రలోనే అత్యంత ఖరీదైనవిగా నిలిచాయి. న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలో జరగనున్న స్పెయిన్-అర్జెంటీనా ఫైనల్‌కు టికెట్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం ఫైనల్ సగటు టికెట్ ధర 11,327 డాలర్లు. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.9.7 లక్షలు. అత్యంత ఖరీదైన టికెట్ ధర 28,479 డాలర్లు. అంటే దాదాపు రూ.27 లక్షలు. ఈ ధరతో అమెరికా క్రీడా చరిత్రలోనే అత్యంత ఖరీదైన టికెట్‌గా రికార్డు సృష్టించింది. గతంలో 2024 సూపర్ బౌల్ ఫైనల్ సగటు టికెట్ ధర 9,411 డాలర్లతో అగ్రస్థానంలో ఉండగా ఇప్పుడు ప్రపంచకప్ ఫైనల్ దానిని అధిగమించింది. మెస్సీ చివరి ప్రపంచకప్ ఫైనల్ కావొచ్చన్న అంచనాలు, స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమాల్ ప్రభంజనం, ప్రపంచవ్యాప్తంగా అభిమానుల భారీ డిమాండ్ కారణంగా టికెట్ ధరలు అమాంతం పెరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. అభిమానులు భారీ మొత్తాలు చెల్లించేందుకూ వెనుకాడకపోవడం ఈ ఫైనల్‌పై ఉన్న క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది.



# ప్రియాంకచోప్రా బర్త్‌డే

## విషెస్ చెబుతూ వారణాసి లుక్ విడుదల

మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'లో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు. ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రియాంక చోప్రా ఫొటోస్ రిలీజ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో మరోసారి ఆసక్తికర ప్రచారం మొదలైంది. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న వారణాసి తొలి గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు అభిమానులు, ఫ్యాన్ పేజీలు పెద్ద ఎత్తున పోస్టులు చేస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. 'బాబు బర్త్‌డేకు భారీ సర్ప్రైజ్', 'బాబు బర్త్‌డేకు గ్లింప్స్ లోడింగ', 'ఆగస్టు 9న ఇంతకుముందెన్నడూ చూడని హైప్ చూడబోతున్నారు' అంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు షేర్ చేస్తున్నారు. దీంతో హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్‌లో ఉన్నాయి.

# ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ

ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్

రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం ప్రభాస్ లుక్. ఒక వార్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో ఇప్పటికే 'ఫౌజీ' సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, ఈ సినిమా కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో స్పష్టంగా తెలుస్తోంది.





# మరోమారు వార్తల్లో నటి నమిత

## స్లిమ్‌గా మారిన ఫోటోలతో నెటిజన్ల ఆసక్తి

ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన నమిత ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ కుటుంబ జీవితంలో బిజీగా గడుపుతున్న ఆమె.. తాజాగా తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు.ఒకప్పుడు బొద్దుగా కనిపించిన నమిత.. ఇప్పుడు పూర్తిగా స్లిమ్‌గా మారి అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. జిమ్‌లో కఠినంగా వర్కౌట్స్ చేస్తున్న వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. మీ మనసు ఏదైతే నమ్ముతుందో.. మీ శరీరం దానినే అనుసరిస్తుంది అనే సందేశాన్ని కూడా ఆ వీడియోకు జత చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వరుసగా కామెంట్లు చేస్తున్నారు. ఇంత స్లిమ్‌గా మారారు ఏంటి?, నిజంగా ఇది నమితేనా?, స్టైష్ లుక్ అదిరిపోయింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆమె కొత్త లుక్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తెలుగులో 'సొంతం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆమె.. 'ఒక రాజు ఒక రాణి', 'ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి', 'బిల్లా', 'నాయకుడు', 'సింహా', 'మన్యం పులి' వంటి చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా బాలకృష్ణ నటించిన 'సింహా' సినిమాలో ఆమె గ్లామర్, నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# రామ్‌చరణ్ సుకుమార్ కాంబో

## ఆర్17 పట్టాలకెక్కనుందని ప్రచారం

ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ 17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్`రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు.





# నాని ప్యారడైజ్‌కు భారీ డిమాండ్

నాచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో భారీ రికార్డ్స్ సృష్టిస్తుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ది ప్యారడైజ' నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రీ డిస్టిబ్యూటర్స్ రూ.37 కోట్లకు సొంతం చేసుకుంది. నాని కెరీర్‌లో ఇప్పటివరకు ఏ చిత్రానికీ ఈ స్థాయిలో నైజాం బిజినెస్ జరగకపోవడంతో ఇది రికార్డు డీల్‌గా నిలిచింది. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085